రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు) సా.6.21

సహరి(శుక్ర) ఉ.4.50

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	38.0	24.0

నేడు టీడీపీ రెండో జాబితా



- నేడు అధికారికంగా ప్రకటించనున్న చంద్రబాబు
- రాజమహేంద్రవరం రూరల్‌కు గోరంట్ల?
- గోపాలపురం అభ్యర్థిని ప్రకటించే అవకాశం
- కొవ్వూరు అభ్యర్థి ఎవరో?

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

నాయకుల ఎదురుచూపులకు నేడు తెరపడనుంది. తెలుగుదేశం పార్టీ రెండో జాబితాను గురువారం 4 గంటలకు ప్రకటించనుంది. ఈ జాబితాలో జిల్లాలోని పెండింగ్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తారనే ఆశాభావంతో అభ్యర్థులు, నియోజకవర్గాల పార్టీ శ్రేణులు, ప్రజలు ఉన్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. నిడదవోలు,రాజానగరం రెండు స్థానాలను జనసేనకు కేటాయించిన సంగతి తెలిసిందే. నిడదవోలుకు ఉమ్మడి అభ్యర్థిగా కందుల దుర్గేష్, రాజానగరం నుంచి ఉమ్మడి అభ్యర్థిగా బత్తుల బలరామకృష్ణను ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలుగుదేశం పార్టీ తొలిజాబితాలో ఇప్పటికే రాజమహేంద్రవరం సిటీ ఆదిరెడ్డి వాసు, అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్లను ప్రకటించారు. రాజమహేంద్రవరం రూరల్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేరు ఖరారైనట్టు తెలిసింది.రెండో జాబితాలో ఆయన పేరును అధికారికంగా ప్రకటించనున్నారు. ఇక మరో రెండు స్థానాలు గోపాలపురం, కొవ్వూరు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. గోపాలపురం నియోజకవర్గం టిక్కెట్ డైలమాలో పడింది. ఈ నియోజకవర్గం నుంచి మంగళవారం చంద్రబాబు గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండల పార్టీ అధ్యక్షులు,ఇద్దరు స్టేట్ కమిటీ సభ్యులు, వెంకట్రాజు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజును పిలిపించి నేరుగా మాట్లాడిన సంగతి తెలిసిందే. ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు పేరునే ప్రకటిస్తారనే ప్రచారం జరుగుతోంది.ఈ అభ్యర్థి మార్పు ఉంటుందని మరో వర్గం ప్రచారం చేస్తోంది.. ఇదిలా ఉండగా గోపాలపురం నియోజకవర్గంలో బుధవారం ఐవీఆర్ఎస్ (ఇన్‌ట్రాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా టీడీపీ అధిష్టానం సర్వే చేయించింది. దీంతో ఇక్కడి అభ్యర్థిని కూడా రెండో జాబితాలో ప్రకటించే అవకాశం ఉంది. ఇక కొవ్వూరు నియోజక వర్గంలో అభ్యర్థి తేలాల్సి ఉంది. కొవ్వూరు పార్టీ నాయకులు పెండ్యాల అచ్చిబాబు,ద్విసభ్య కమిటీ సభ్యులు చౌదరి, రామకృష్ణలతో కూడా చంద్రబాబు మాట్లాడిన సంగతి తెలిసిందే.ఇక్కడ నుంచి పోటీ చేయడానికి మాజీ మంత్రి జిల్లా పార్టీ ప్రెసిడెంట్ కెఎస్.జవహర్ ప్రయత్నిస్తున్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ఇక్కడ అచ్చిబాబు వర్గం విబేధిస్తోంది.ఈ నేపథ్యం లో చంద్రబాబుతో చర్చలు ఏమి జరిగాయో కానీ నిర్ణయాన్ని అధిష్టానానికి వదిలినట్లు ఇక్కడ ప్రచారం జరిగింది.ఈ నేపథ్యంలో ఇక్కడ అభ్యర్థి ఎవరనేది ఉత్కంఠను రేపుతోంది. కెఎస్.జవహర్, ఆయన కుమారుడు, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు,వాసుదేవరావు వంటివార్ల పేర్లు పరిశీలనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. వీరిలోనే అభ్యర్థులు ఉంటారా? లేక వేరే వారు ఉంటారా అనేది రెండో జాబితాలో తేలిపోయే అవకాశం ఉంది.లేదా ఒకట్రెండురోజులు ఆగవచ్చు. సాధారణంగా నియోజకవర్గంలో పెద్దలతో చర్చించిన తర్వాత అభ్యర్థి ఖరారయ్యే అవకాశాలే ఎక్కువ.ఇదిలా ఉండగా రేపోమాపో ఎన్నికల షెడ్యూల్ కూడా వచ్చేస్తోంది.

ఐదేళ్లకు గుర్తొచ్చామా!



అంత బాగున్నా తవ్వేశారెందుకో మరి: దానవాయిపేటలో సిటీ హాస్పిటల్ రోడ్డు ఇలా

ఎప్పుడేశారబ్బా?: రాజమహేంద్రవరం ఎల్‌బీ శాస్త్రిరోడ్డు అనుసంధాన రహదారుల్లో నిర్మించిన నూతన సీసీ రోడ్డు

ఎందుకీ హడావుడి శంకుస్థాపనలు

- ఎడాపెడా శంకుస్థాపనలు
- ఎక్కడికక్కడ శిలాఫలకాలు
- 7 నియోజకవర్గాల్లోనూ ఇంతే
- రాష్ట్ర ప్రభుత్వ నిధుల మాటే లేదు
- కేంద్ర, సాధారణ నిధులతోనే పనులు
- వైసీపీ నాయకుల ఆర్భాటం
- ప్రచార యావకు పరాకాష్ట
- ఐదేళ్లుగా ఏమయ్యారని ఓటర్ల ప్రశ్న

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీకి ప్రజలు అధికారం ఇచ్చి సుమారు 4 ఏళ్ళ 10 నెలలైంది. ఇన్ని రోజులు ముఖ్యమంత్రి జగన్‌తో సహ ఆయన మంత్రివర్గం, ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరు మొద్దునిద్రలో ఉన్నారు. అందుకే రాష్ట్రంలో రహదారులు, డ్రైనేజీలు, సురక్షిత తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాల కల్పన కూడా పూర్తిస్థాయిలో చేయలేకపోయారు. పుణ్యకాలం కాస్త అయిపోతున్న తరుణంలో ప్రజలను ఓట్లు అడిగేందుకు ఏ మొఖంపెట్టుకుని వెళ్లాలనే ఆలోచనతో ఆగమేఘాలపై హడావుడి పనులు చేస్తున్నారు.. శిలాఫలకాలు వేస్తున్నారు..ఈ ఐదేళ్లుగా రోడ్లు, డ్రైన్లు, పార్కులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పుడు మళ్లీ ఎన్నికల వేళ వైసీపీ నాయకులు ప్రారంభోత్సవాలతో ఊదరగొట్టేస్తున్నారు. ఇంత కాలం జిల్లా అభివృద్ధిని గాలికొదిలేసి ఇప్పుడు ఓట్ల కోసం వైసీపీ నాయకులు అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. ఇదంతా ఎన్నికల స్టంట్ అనేది ప్రజలకు అర్థమౌతుంది.

ఐదేళ్లుగా పట్టలేదు..

రోడ్లపై తిరగలేక జనం ఐదేళ్ల నుంచీ నరకం అనుభవించారు.పట్టణాల్లో, గ్రామాల్లో డ్రైన్లు పట్టించుకున్న నాథుడు లేడు. ఇప్పుడు వైసీపీ నాయకుల్లో ప్రచార యావ మాటున ప్రారంభోత్సవాలు ఉరకలు పెడుతుండడం విస్మయానికి గురిచేస్తోంది.జిల్లా కేంద్రంలో కూడా అదే దుస్థితి. శివారు ప్రాంతాల్లో పందుల స్వైరవిహారం, దోమలు, చెత్త సేకరణ లేకపోవడం, వీధిలైట్లు వెలగక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ గడప గడపకూ కార్యక్రమంలో గుర్తించిన పనులకు ఇంకా అతీగతీ లేదు. కానీ ఎన్నికల వేళ కొత్త పనుల పేరుతో శిలాఫలకాలు కట్టేసి కొబ్బరికాయల మోత మోగిస్తున్నారు. ఈ ఖర్చులు అధికారులపైనే రుద్దుతున్నారని తెలుస్తోంది. దీంతో 'గాలి' పనులకు ఇంత అర్భాటమెందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎక్కడికక్కడ బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. వైసీపీ నాయకుల ఒత్తిడితో అధికారులు వెళ్లి కాంట్రాక్టర్లను బతిమలాడుతున్నారు. ఐదేళ్లలో ఇప్పుడు గుర్తొచ్చామా అంటూ వైసీపీ పాల కులను కాంట్రాక్టర్లూ ప్రశ్నిస్తున్నారు. శిలాఫలకాలు చూసి రాష్ట్ర ప్రభుత్వం నిధులిచ్చిందేమో అనుకోవద్దు సుమా.. ఒక్క రూపాయి విడుదల చేయలేదు. మరి శిలాఫలకాలు ఎందుకంటారా.. మళ్లీ వచ్చే ఐదేళ్లకు..

ఇప్పుడే ఎందుకింత ప్రేమంట?

ఎక్కడైనా ఒక్కో నాయకుడిదీ ఒక్కో తీరు ఉంటుంది.. జిల్లాలో వైసీపీ నాయకులందరిదీ ఒకటే తీరు. ఎందుకంటే ఎన్నికల వేళ నాయకులందరికీ ప్రజలపై ఒక్కసారిగా ప్రేమ పెరిగిపోయింది. ఎంతంటే సమస్యలు గుర్తించి హడావుడి ప్రారంభోత్సవాలు చేసేటంత.. ఒకసారి అవేంటో చూద్దాం.. ప్రారంభోత్సవాల ప్రాపకంలో మంత్రి వేణు మునిగి తేలుతున్నారు. జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి అయినా అధికా రంలోకి వచ్చాక ఇన్నాళ్లు కన్నెత్తి కూడా చూడలేదు. ప్రస్తుతం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఇన్ చార్జి కావడంతో శివారు ప్రాంతాల్లో సంచరిస్తూ డ్రైన్లు, రోడ్ల పనులకు కొబ్బరికాయలు కొడుతున్నారు. ఈ పనులు ఎప్పటి పూర్తవుతాయో ఆయనకే తెలియాలి. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మాణాలు పూర్తయిన వాటికి రిబ్బన్లు కత్తిరిస్తున్నారు. రాజమహేంద్రవరం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ముందు నుంచీ ఎంపీ భరత్‌రామ్ తానేరాజు తానే మంత్రి అనే చందంగా వ్యవహరిస్తుండడం తెలిసిందే. అనవసరమైన అలంకరణలకు అభివృద్ధి పేరు పెట్టి జనాల కళ్లకు గంతలు కట్టే ప్రయత్నం యథేచ్ఛగా చేస్తున్నారు. నాటిన మొక్కలకు, నాటుతున్న వాటికి లెక్కా పత్రం ఏమీ లేదు. కార్పొరేషన్ నిధులను మట్టిలో పోస్తున్నారు. పార్కుల్లో, రోడ్లపక్కన లైటింగ్ పెట్టడానికి, జంక్షను పాయింట్లను కుచించడానికే ఎంపీ పరిమితమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. మోరంపూడి ఫ్లైఓవర్ ఎంపీగా మురళీమోహన్ ఉన్నప్పుడే మంజూరైనా ఎంపీ భరత్ తన ఖాతాలో వేసేసుకున్నారు. ఎంపీ ఆర్భాటాలకు ఖర్చు చేస్తున్న సొమ్ముతో నగరాన్ని పట్టిపీడిస్తున్న డ్రైనేజీ సమస్య నుంచి బయట పడేయొచ్చు. శివారు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లులేని ఏరియాలు చాలానే ఉన్నాయి. నగరంలో నాలుగు పార్కుల్లో జిమ్మిక్కుల లైటింగ్ పెట్టి ఎలక్షన్ స్టంటును ఎంపీ భరత్ రక్తికట్టిస్తున్నారే విమర్శ లకు కొదువలేదు. ఐదేళ్ల కాలంలో ఎంపీ స్థాయిలో ఆయన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెప్పుకొనే స్థాయిలో నిధులూ లేకపోవడం గమనార్హం. కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కూడా సచివాల యాలు తదితర ప్రారం భోత్సవాల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. గడప గడపకూ 82 పనులు ప్రారంభించగా అందులో కేవలం 15 పనులే పూర్తయ్యాయి.వాటికీ బిల్లులు వస్తాయనే నమ్మకం కాం ట్రాక్టర్లకు లేదు.దీంతో పనులు చేయడానికి ఎవరూ ముం దుకు రావడం లేదు. కొవ్వూరు మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్న కుమారి పలు రోడ్లు, డ్రైన్లకు, పెనకనమెట్లలో రోడ్లు,డ్రైన్లకు పట్టాభిరామారావు ఆధ్వర్యంలో కొబ్బరి కాయలు కొట్టారు. కానీ నిధులే కరువయ్యాయి. కొవ్వూరు టౌన్ మోడల్ పోలీస్ స్టేషన్‌కు మంత్రి తానేటి వనిత బుధవారం ప్రారంభించారు.ఆమె రాజకీయ బదిలీపై గోపాల పురం వెళ్లినా హోంమంత్రి హోదాలో స్టేషన్ ప్రారం భోత్సవం చేశారు.రాజానగరం నియోజకవర్గంలో జూని యర్ కళాశాల హామీ ఇప్పటికీ నెరవేరలేదు. ఈ నియో జకవర్గంలో అధిక శాతం రోడ్లు, డ్రైన్లు టీడీపీ హయాం లోనే పూర్తయ్యాయి. దీంతో హంగు కోసం కొన్ని ప్రారం భోత్సవాలు చేస్తున్నారు. ఈ నెల 12న కలవచర్లలో పారి శ్రామికవాడకు కొబ్బరికాయ కొట్టారు. ఈ నిధులు కేంద్ర ప్రభుత్వానివి. కార్యరూపం ఎప్పుడు దాలుస్తుందో వేచి చూడాల్సిందే. ఏడీబీ రోడ్డు గత నాలుగన్నరేళ్లుగా అలాగే ఉంది.అయినా పట్టించుకున్న నాథుడే లేడు. రివర్స్ టెం డర్‌లో భాగంగా పనులను ఆపేశారు. నాటి నుంచి అయోమయమే.నిడదవోలులో కూడా ఐదేళ్ల నుంచీ అతీ గతీ లేని పనులను ఇప్పుడు తెరపైకి తెచ్చి హడావుడీ చేస్తున్నారు.అనపర్తిలో అవినీతి, మాటల్లోనే జరిగిన అభి వృద్ధిపై చర్చకు మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సవాల్ చేయగా పోలీసుల సహాయంతో ఆయనను నిలువరించి.. సిట్టింగ్ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి ఇంటి పట్టునే గుట్టుగా ఉన్న విషయం తెలిసిందే.గోపాలపురం నియోజక వర్గంలో రోడ్లు,డ్రైన్లు దుస్థితిలో ఐదేళ్ల నుంచీ కొట్టుమి ట్టాడుతున్నాయి.

నాణ్యత 'గాలి'కేనా..

అర్భాటపు పనుల్లో నాణ్యత 'గాలి'కొదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి రోజూ చెకింగ్ రిపోర్టులు ఆయా పని ప్రాంతాల్లో రోజూ అందుబాటులో ఉండాలి. సిమెంటు, ఇసుక, కంకర నాణ్యత గురించి ఎవరైనా వెళ్లి ప్రశ్నిస్తే వాటిని చూపించాలి. కానీ.. ఇప్పుడు పని అంతా అయిపోయాక ఎంబుక్ రికార్డు చేశాక దానిలోని తేదీల ప్రకారం క్వాలిటీ కంట్రోల్ రిపోర్టులను 'ఎందుకో' ఇచ్చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డ్రైన్ల నిర్మాణం మరీ దారుణంగా జరుగుతోందని అంటున్నారు. క్వాలిటీ కంట్రోల్ కంపెనీకి వైసీపీ పెద్దలతో 'సత్సంబంధాలు' ఉండడంతో ఫొటోలతో 'సరిపెట్టేస్తూ' నాణ్యతకు తిలోదకాలు ఇచ్చేశారనే విమర్శలు పెద్ద సంఖ్యలో వినవస్తున్నాయి. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న పనులు నాణ్యత విషయంలో మరీ దారుణంగా ఉన్నాయని అంటున్నారు.



కొవ్వూరులో పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న హోం మంత్రి వనిత

నాలుగేళ్ల కిందట నిధులొచ్చినా.. ఇప్పుడే శంకుస్థాపన

కొవ్వూరు, మార్చి 13 : ఎట్టకేలకు కొవ్వూరు పట్టణ పోలీస్ స్టేషన్ నూతన భవనానికి హోం మంత్రి తానేటి వనిత శంకుస్థాపన చేశారు. పోలీస్ స్టేషన్ నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే రూ.1.40 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు.అయితే ఆ తరువాత నిధులు మురిగిపోయాయన్నారు. మళ్లీ పోరాడి నిధులు తెచ్చానని పేర్కొన్నారు. అధునాతనంగా మోడల్ పోలీస్టేషన్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. అయితే ఆమె కొవ్వూరులో మంత్రి హోదాలో ఉన్నప్పుడు ఈ పోలీస్ స్టేషన్ గురించి ఆలోచించలేదు. ఎన్నికల వేళ గోపాలపురం నుంచి వచ్చి హడావుడి ప్రారంభించడం కొసమెరుపు.కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు,ముని సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఏలూరు రేంజ్ డీఐజీ జి.వి.జి.అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ పి.జగదీశ్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ డి.ప్రభాకర్, కొవ్వూరు డీఎస్పీ రామారావు, టౌన్ సీఐ వి.జగదీశ్వరరావు పాల్గొన్నారు.





ఇదే శిలాఫలకమందోయ్: రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టే పనులకు ఫ్లెక్సీ ఆవిష్కరించి..కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఇన్‌చార్జి, మంత్రి వేణుగోపాలకృష్ణ

ఎంపీగారూ.. ఇదేం తీరు!

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 13 : రాజమహేంద్రవరంలో పనులు జాతర జరుగుతుంది. హడావిడిగా ఎన్నికల కోడ్ వచ్చేలోగా పనులు ప్రారంభించేస్తే ముందుగానే మంజూరైన పనులు కాబట్టి ఎన్నికల కోడ్ ఆంక్షలు ఉండవనే ఆలోచనతో వైసీపీ ప్రజాప్రతినిధి నగరంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పార్కుల్లో పనులు వేగవంతంగా చేయిస్తున్నారు.ఈ పనులు నాణ్యతలేమితో జరుగుతున్నా యి. ఇప్పటి వరకు పనుల విషయంలో నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వం 40 రోజుల్లో ఎన్నికలను పెట్టుకుని ఇప్పు డు సిసిరోడ్లు, డ్రైనేజీలు, పార్కుల్లో సుందరీకరణ పనులు, చేసేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు తక్కువ నగరపాలక సంస్థ సాధారణ నిధులు ఎక్కువశాతంతో పనులు జరుగుతున్నాయి. రాత్రికి రాత్రికి పను లు చేస్తున్నారు. గాంధీ పార్కులో సుందరీకరణ పనులు, దానవాయిపేట, గాంధీపురం, లలితానగర్, శ్రీరామ్ నగర్, ఎల్‌బి శాస్త్రి రోడ్డు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు వేగంగా జరుతున్నాయి. వెనుకబడిన ప్రాంతాల్లో మాత్రం ఎటువంటి అభివృద్ధి కనిపించడంలేదు. నగరంలో ముంపుప్రాంతాల్లో సమస్యలపై శాశ్వత పరిష్కారం లేకుండా పనులు జరుగుతున్నాయి. రానున్న ఎన్నికల్లో ప్రజలను ఆకర్షించేందుకు పనులు వేగంగా చేస్తున్నారు. ఐదేళ్లగా వదిలేసి ఇప్పుడు మాత్రం పరుగులు పెడుతున్నారు. హడావుడి పనులపై ప్రజలు లోలోపల మండిపడుతున్నారు. బయటపడితే వలంటీర్ల ద్వారా వైసీపీ నాయకులకు తెలిసి వారి నుంచి ఎలాంటి పరిస్థితులు ఎదు రవుతాయోనని నోరు మెదపడంలేదు. కాని ఎన్నికల్లో వారి పవర్ ఏమిటో చూపిస్తారని చెప్పడం కనిపిస్తోంది.



మేడిపండు తరహా రోడ్డు : ప్లాస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు



నాణ్యత ఎంత? : దానవాయిపేట గాంధీ పార్కులో వేగంగా సా..గుతున్న పనులు

ఎన్నికల జీవోలేనా.... ఎవరిని మభ్యపెట్టడానికి!

రాజమహేంద్రవరం రూరల్ మార్చి13 : పాతవాటికే బిల్లులు రాలేదు.. కొత్త పనులు ఎలా చేపట్టాలంటూ గుత్తేదారులు గగ్గోలు పెడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత నాలుగేళ్లుగా కానరాని అభివృద్ధి పనులకు హడావుడి జీవోలు తెచ్చి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంత్రి వేణుగోపాలకృష్ణ గ్రామాల్లో అట్టహాసంగా శంకుస్థాపనలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ. 10 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధి 10 గ్రామాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు తదితర నిర్మాణాలకు జీవో తెచ్చారు. పనులకు సంబంధించి టెక్నికల్ శాంక్షన్లు తయారు చేశారు. గత వారం రోజులుగా గ్రామాల్లో అధికారులు, నాయకులను వెంటబెట్టుకుని కనీసం శిలాఫలకాలు కూడా లేకుండా ఫ్లెక్సీలను పెట్టి శంఖుస్థాపనలు చేస్తున్నారు. నేటికి ఏ పని చేయడానికి గుత్తేదారులు ముందుకు రావడంలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గతేడాది నవంబరు నెలలో ఉపాధి హామీ పథకం కింద రూరల్ మండలానికి రూ.60 లక్షల నిధులు మంజూరు చేశారు. సుమారు ఆరు నెలలు కావొస్తున్నా నేటికి వీటికి సంబంధించి పనులు మొదలు కాలేదు. మండల పరిషత్, పంచాయతీ నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

కాంట్రాక్టర్లకు రూ. కోటికి పైగా బకాయిలు

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మాణాలు చేపట్టిన భవనాలకు సంబంధించి ఒక్క రూరల్ మండలం పరిధిలోనే సుమారు 1.50 కోట్లు బకాయిలు గుత్తేదారులకు ఉంది. చేసిన పనుల బిల్లులన్నీ సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ అయినా నేటికి బిల్లులు అందలేదు. దీంతో గుత్తేదారులు తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉంది. ఈ పనులు చాలా మంది అధికార పార్టీ వారు చేపట్టడంతో నోరు మెదపలేకపోతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకూ ఫారం 7,8 స్వీకరణ

- త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్
- జనవరి 23 నుంచి 11,331 ఓట్లు తొలగింపు
- జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 13: త్వరలో సార్వత్రిక ఎన్నికలు నోటిఫికేషన్ విడుదలవుతుందని జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత తెలిపారు. ఈ మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లు దాఖలు, అఫిడవిట్లు సమర్పించే విషయంలో ఎన్నికల కమిషన్ నియమావళి సమయపాలన ఖచ్చితంగా పాటించాలన్నారు. ఎన్నికలు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీ తనంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజల ద్వారా వచ్చే ఫిర్యాదులు వివిధ మాధ్యమాల్లో వచ్చే ప్రతికూల వార్తలు విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు తీసుకున్న చర్యల గురించి ఎప్పటికప్పుడు వివరణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే తేదీ వరకు ఫారం 7,8 స్వీకరిస్తామన్నారు. 18 ఏళ్ళ నుంచి 21 ఏళ్ళ మధ్య వయస్సు ఉన్న వారి నుంచి ఫారం 6 దరఖాస్తులు తీసుకుంటామన్నారు. తుది ఓటరు జాబితా నుంచి మరణించిన వారి ఓట్ల తొలగింపు విధానంలో ప్రధాన ఎన్నికల అధికారి ఆమోదం పొందడం జరుగుతుందన్నారు. జనవరి 23 నుంచి ఈ రోజు వరకు 11,331 ఓట్లను తొలగించామని చెప్పారు. చిరునామా మార్పుకు సంబంధించి 4,392 ఓట్లు , మరణించిన ఓట్లు 4225 , డూప్లికేట్ ఓట్లు 2701 ఓట్లు ఉన్నాయన్నారు. ఓటు హక్కుకలిగి ఉండి ఎపిక్ కార్డ్ లేకపోయినా ఏదో ఒక గుర్తింపుకార్డుతో ఓటు వేయవచ్చన్నారు. సమావేశంలో డీఆర్‌వో జి.నరసింహులు, కేఆర్ఆర్‌సీఎస్‌డీడీ ఆర్.కృష్ణనాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కాంగ్రెస్ నాయకులు నలబాటి రమేష్, బీజేపీ పివి లక్ష్మి, సీపీఎం ఎస్ఎస్.మూర్తి, టీడీపీ సిహెచ్ శ్రీనివాసరావు, వైసీపీ వైవీఎస్ శ్యామల , ఎలక్షన్ డీటీ ఎమ్.సునీల్ కుమార్ ,గిరీష్ ,తులసి పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

56 గ్రాముల బంగారం స్వాధీనం

రాజమహేంద్రవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో దొంగతనాలు చేస్తున్న ఓ వ్యక్తిని ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ) అరెస్టు చేశారు. డీఎస్పీ ఎల్.మోహన్‌రావు ఆదేశాలతో రైళ్లలో చోరీలు చేస్తున్న దొంగలపై రాజమహేంద్రవరం రైల్వే పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. దీనిలో భాగంగా తాడేపల్లిగూడెం మండలం మాధవరం గ్రామానికి చెందిన కడియాల శ్రీధర్‌ని జీఆర్పీ ఎస్ఐ పి.లోవరాజు అదుపులోకి తీసుకున్నారు. అతడిపై మూడు కేసుల్లో నమోదైన రూ.2.50లక్షల విలువ చేసే 56 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విజయవాడలోని రైల్వే కోర్టులో హాజరుపరిచామని డీఎస్పీ పేర్కొన్నారు. దర్యాప్తులో ప్రతిభ చూపిన ఎస్ఐ లోవరాజు, కానిస్టేబుళ్లు వీరబాబు, రవి, రమణారావు, ఆర్పీఎఫ్ సిబ్బందిని ఆయన అభినందించారు.





వైరు తగిలిందా! ప్రాణాలు గోవిందా!

రాజమహేంద్రవరం కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం ఈ చిత్రాలు.. ఇది నిత్యం రద్దీగా ఉండే రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డు.. ఇది అసలే ఇరుకు రోడ్డు.. ప్రతి రోజూ వేలాది మంత్రి ఈ రోడ్డుపై అటూ ఇటూ తిరుగుతూనే ఉంటారు.. అటువంటి రోడ్డుపై ఎంపీ భరత్ పుణ్యమా అని సుమారు ఏడాది కిందట సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అయితే ఏమైందో ఏమో కానీ ఆ లైట్లు పీకేశారు. అయితే కార్పొరేషన్ సిబ్బంది కరెంట్ వైర్లు మాత్రం ఇలా బహిరంగంగా వదిలేశారు.. ఏదైనా కరెంట్ వైరుకు ఉన్న టేపు ఊడిందా అంతే ప్రాణాలు గోవిందా.. ఇకనైనా కళ్లు తెరవండి...జాగ్రత్త చేపట్టండి. - రాజమహేంద్రవరం సిటీ

19 నుంచి కోరుకొండ తీర్థం ప్రారంభం

- ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు
- ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన అధికారులు, పండితులు





పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, పండితులు

కోరుకొండ,మార్చి13: శతాబ్దాల చరిత్ర కలిగిన కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రమోహన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ముఖ మండపం నందు దేవస్థానం ఛైర్మన్ పరాసర రంగరాజభట్టర్ స్వామి, దేవస్థానం పర్యవేక్షణాధికారి కాపవరపు సూర్యనారాయణ, ఎస్‌వీవీఎస్ఎన్ మూర్తి, చంగన వీర్రాజు, వీఎస్ అనీల్‌కుమార్ తదితరులు ఉత్సవాలకు సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. దీని ప్రకారం ఈ నెల 19వ తేదీ మంగళవారం సాయంత్రం 5 గంటలకు వైఖానస ఆగమ పండితులు పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు, అనువంశిక అర్చక స్వాములు స్వామి వారి కోనేరు వద్ద నుంచి పుట్ట మన్ను తెచ్చి అంకురార్పణ, ధ్వజారోహణం చేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 20వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు స్వామి వారి రథోత్సవం. రాత్రి 9 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం, 21వ తేదీ గురువారం కొండపైన, కొండ దిగువున స్వామి వారి దర్శనాలు, రాత్రి 9గంటలకు స్వామి వారికి గరుడ వాహన సేవ నిర్వహిస్తారు. 22వ తేదీ శుక్రవారం ఉదయం నిత్యోపాసనతో స్వామివారి దర్శనాలు ప్రారంభమవతాయి. రాత్రి 7 గంటలకు స్వామి వారి ఆలయ ముఖ మండపంలో వేద పండితుల సమక్షంలో స్వామి వారికి సదస్యం జరుగును. రాత్రి 9 గంటలకు హనుమద్ వాహనంపై స్వామి గ్రామోత్సవం జరుగుతుంది. 23వ తేదీ శనివారం స్వామి వారి నిత్యోపాసన అనంతరం దర్శన ఏర్పాట్లు చేస్తారు. రాత్రి 9గంటలకు స్వామి వారికి గజవాహనంపై గ్రామోత్సవం. అదే రోజు రాత్రి 7 గంటలకు శ్రీ రంగరాజ స్వామి ఆలయంలో రంగరాజస్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 24వ తేదీ ఆదివారం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారికి ఉదయం 9 గంటలకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి, శ్రీ అనంతపద్మనాభ స్వామివారి సమక్షంలో దేవుని కోనేటి వద్ద శ్రీ చక్ర పెరుమాళ్ళకు పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, అనంతరం చక్ర తీర్థం జరుగుతుంది. సాయంత్రం ధ్వజారోహణ, అద్దాల సేవ, ఊంజల సేవ నిర్వహిస్తారు. రాత్రి 9గంటలకు స్వామివారి శేషవాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది. 25వ తేదీ సోమవారం సాయంత్రం స్వామి వారికి ద్వాదశప్రదక్షిణలు, ద్వాదశ నివేదనలు, పర్యాంక శయనోత్సవం, శ్రీ పుష్పయాగం జరుగుతుందని రంగరాజభట్టర్ స్వామి తెలిపారు.



అధికారులు, ఉపాధ్యాయులతో విద్యార్థులు

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు ప్రాజెక్టుల ఎంపిక

రాజమహేంద్రవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నుంచి రెండు వైజ్ఞానిక ప్రదర్శనలు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయని జిల్లా సైన్సు అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ తెలిపారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకూ చిత్తూరు జిల్లా గంగవరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ జరిగిందన్నారు. కొవ్వూరు మండలం ఐ.పంగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బైసెట్టి లక్ష్మణ్, గైడ్ టీచర్ మల్లిపూడి రాజు రూపొందించిన రైతుబంధు అనే వ్యవసాయ యంత్రం, సీతానగరం మండలంలోని రఘుదేవపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.నాగేంద్రకుమార్, గైడ్ టీచర్ జి.శేఖర్ రూపొందించిన చేతితో సులభంగా కొబ్బరికాయ ఒలిచే యంత్రం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. విద్యార్థులను, గైడ్ టీచర్లను జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, సమగ్ర శిక్షా ఏపీసీ ఎస్.సుభాషిణి, డిప్యూటీ ఈవో ఈవీబీఎన్ నారాయణ, జిల్లా సైన్సు అధికారి నెహ్రూ అభినందించారు. రెండు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.

జాతీయ సైన్స్ పోటీలకు ఎంపిక



కాకినాడ రూరల్,మార్చి13: జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు కాకినాడ జిల్లా నుంచి ఒక ప్రాజెక్టు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ అర్బన్ మండలం గొడారిగుంట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలకు చెందిన గుత్తుల అనుష్క రూపొందించిన సీడర్ ఫర్ స్మాల్ స్కేల్ ఫార్మర్స్ అనే ప్రాజెక్టు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 11నుంచి 13వతేదీ వరకూ చిత్తూరు జిల్లా పలమనేరులో రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలు నిర్వహించారన్నారు. చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో 240 ప్రాజెక్టులు ప్రదర్శించగా వాటిలో 24 ప్రాజెక్టులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాయన్నారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా నుంచి జాతీయస్థాయికి ఎంపికైన ప్రాజెక్టును రూపొందించిన గుత్తుల అనుష్కను, గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయుడు చంద్రారెడ్డిని ఆర్జేడీ జి.నాగమణి, డీఈవో పి.రమేష్, డీవైఈవో ఆర్జే డేనియల్ రాజు, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ అభినందించారు.

ఇదేం స్పీడు..

ఊబలంక ర్యాంపు వద్ద లారీ డ్రైవర్లతో వైసీపీ యువకుల వాగ్వాదం

అనంతరం పార్టీ పెద్దలతో చర్చలు

'లెక్క' తేలక ఊబలంక ఇసుక ర్యాంపు నిలిపివేత



నిలిచిపోయిన తవ్వకాలు

రావులపాలెం, మార్చి 13: ఇసుక ర్యాంపులకు అనుమతులు లేకపోయినా ఊబలంక ప్రాంతం నుంచి రోజుకు వందలాది లారీల్లో ఇసుక తరలిపోతోంది. ఇదే విషయంపై వైసీపీ నాయకులను ఆ పార్టీలోని యువకులే ప్రశ్నించారు. అసలు ఇసుక ఎక్కడికి పోతోంది. ఆదాయం ఎక్కడికి వెళ్తోంది..అనే కోణంలో ప్రశ్నల వర్షం కురిపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఊబలంక ఇసుక ర్యాంపు నుంచి నిబంధనలకు విరుద్ధంగా రోజూ వందలాది లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. మంగళవారం రాత్రి మితిమిరిన వేగంతో లారీలు ప్రయాణిస్తుండడంతో గ్రామంలో వైసీపీకి చెందిన యువకులు ర్యాంపులోకి వెళ్లి లారీ డ్రైవర్లను నిలదీశారు. మితిమీరిన వేగంతో వెళ్తున్న కారణంగా లారీల్లో ఇసుక లోడ్ చేయడాన్ని అడ్డుకున్నారు. దీంతో డ్రైవర్లు, యువకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో అక్కడ ఉన్న ఇసుక జట్టు మేస్త్రీ వారిని వారించే ప్రయత్నం చేసి ఘర్షణకు దిగాడు. దీంతో యువకులు ఆవేశానికి గురై ర్యాంపు మూసివేయాలని నినాదాలు చేశారు. కాగా యువకులతో రావులపాలెంలోని వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ పెద్దలు చర్చలు జరిపినట్టు సమాచారం. ఆ సమయంలో యువకులు ఇసుక ర్యాంపు ఎవరు నడుపుతున్నారు.. ర్యాంపు నుంచి వచ్చే ఆదాయం ఎక్కడికి వెళ్తోంది... గతంలో ఏ విధంగా నడిచేది... ఇప్పుడు ఏ విధంగా నడుస్తోంది అని పెద్దలను నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య చర్చలు ఫలించకపోవడంతో ఇసుక ర్యాంపు తాత్కాలికంగా మూతపడింది. అయితే గ్రామంలో మరోమారు చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

సార్.. గురు దక్షిణ

కాకినాడలో ఓ బీజేపీ ఆశావహ అభ్యర్థి అప్పుడే డబ్బుల ఎర

టికెట్ ప్రయత్నాలకు ఆశీర్వాదం కోరుతూ బీజేపీ కీలక నేతలకు స్వీట్ బాక్సులు

అందులో రూ.20వేల వరకు నగదు ఉంచి అందజేత

గురు దక్షిణ తీసుకోవాలంటూ స్వయంగా కలిసి విన్నపం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి) కాకినాడలో ఓ ప్రముఖ ఇంజనీరింగ్ విద్యాసంస్థ యజమాని టికెట్ కోసం ఏకంగా బరితెగించేశాడు. బీజేపీలో సీనియర్ నేతలకు స్వీట్ బాక్సులు పంపి అందులో నగదు కవర్ అందించడం తీవ్ర దుమారం రేపుతోంది. కాకినాడ సిటీ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ ఆశిస్తున్న ఈయన కొన్ని రోజులుగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పొత్తులో భాగంగా బీజేపీ పది అసెంబ్లీ సీట్లు దక్కించుకున్న నేపథ్యంలో అందులో కాకినాడ సిటీ సీటు కూడా ఉండేలా చూడాలని, ఆ టికెట్ తనకు వచ్చేలా ఆశీర్వదించాలంటూ నగరంలో అనేకమంది బీజేపీ సీనియర్ నేతలందరినీ కలుస్తున్నారు. వారందరికీ శాలువాలు కప్పి స్వీట్ బాక్సులు అందిస్తున్నారు. అందులో రూ.20 వేల వరకు నగదు ఉంచి గురుదక్షిణ అంటూ వారి కాళ్లపై పడుతున్నారు. తీరా స్వీటు బాక్సులు తెరిచి చూస్తే అందులో నగదు ఉండడం చూసి బీజేపీ నేతలు అవాక్కవుతున్నారు. అసలు సదరు నేత ఇంకా బీజేపీలో కూడా చేరలేదు. కానీ నగరం అంతటా మోదీని పొగుడుతూ ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారు. అటు ఆరెస్సెస్ నేతలను కలిసి సీటు ఆశీర్వాదం పొందారని ఆయన ప్రచారం చేసుకుంటున్నారు. ఇలా స్వీటు బాక్సులు అందుకున్న కొందరు సీనియర్లు వాటిని వెనక్కు తిప్పి పంపేశారు. గురుదక్షిణ పేరుతో తమకు డబ్బులు ఇవ్వడంపై ఫోన్ చేసి చివాట్లు కూడా పెట్టారు. పార్టీలో లేని సంస్కృతిని తీసుకురావడంపై మండిపడుతున్నారు. కాగా సదరు విద్యాసంస్థల యజమాని కాకినాడ సిటీ, పిఠాపురం తదితర స్థానాల్లో గతంలో పలు పార్టీల నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు.

నేను గెలిచేందుకు సాయం చేయండి

మీకు ఇబ్బందొస్తే నేను చూసుకుంటా

వలంటీర్లతో కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



ఓటర్ల లిస్టును పరిశీలిస్తున్న వలంటీర్లు, గృహసారథులు

రావులపాలెం, మార్చి 13: 'వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నా విజయానికి మీరు కృషి చేయండి... మీకు ఏదైనా ఇబ్బంది వస్తే నేను చూసుకుంటా' అని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వలంటీర్లకు దిశానిర్దేశం చేశారు. రావులపాలెంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో బుధవారం ఆయన బూత్ ఏజెంట్లు, గృహ సారథులు, వైసీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి వలంటీర్లు కూడా హాజరుకావడం విశేషం. రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు మండలాలకు చెందిన వారు హాజరు కాగా టేబుళ్లు, కుర్చీలు వేసి వారి ముందు ఓటర్ల జాబితాలు పెట్టారు. 2019 ఎన్నికల్లో బూత్‌ల వారీగా వచ్చిన మెజారిటీ, ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయి అన్న అంశాలను పరిశీలించారు. బూత్‌లు, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి వివరాలనూ సేకరించారు. అనంతరం జగ్గిరెడ్డి టేబుళ్ల వద్దకు వెళ్లి అక్కడున్న వారికి వైసీపీకి ఓట్లు పడేలా చూడాలని సూచించారు. మీకు కేటాయించిన కుటుంబాల వారు వైసీపీకి ఓటు వేసేలా ఓటర్లను చైతన్యపరచాలని వలంటీర్లకు స్పష్టం చేయడం విశేషం.

రెండోసారి..

వంతెన నిర్మాణ పనులకు నాడు భూమి పూజ...

నేడు శిలాఫలకం ఆవిష్కరణ

ఎన్నికల వేళ వైసీపీ నాయకుల హంగామా



పనులు జరుగుతున్న దృశ్యం

పి.గన్నవరం, మార్చి 13: అప్పుడు భూమి పూజ చేశారు... ఇప్పుడు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి వైసీపీ ప్రజాప్రతినిధులు చేస్తున్న పీట్లు అన్నీ ఇన్నీ కావు. ఈ విచిత్ర పరిస్థితి గంటి పెదపూడిలో బుధవారం చోటుచేసుకుంది. పి.గన్నవరం మండలం గంటి పెదపూడి శివారు మూడు గ్రామాలు, ఉడిమూడి శివారు ఒక గ్రామానికి చెందిన లంక గ్రామస్తులు రాకపోకలు సాగించడానికి వంతెన నిర్మాణం నిమిత్తం గత ప్రభుత్వ హయాంలో రూ.49.50 కోట్లు మంజూరయ్యాయి. కాగా గతేడాది అతికష్టం మీద ఒక ప్రముఖ ఇంజనీరింగ్ కంపెనీకి టెండర్లను ఖరారు చేశారు. అనంతరం వంతెన ఏర్పాటు విషయమై రెండు లంక గ్రామాల మధ్య నెలకొన్న విభేదాలను సైతం అధిగమించి చింతావారిపేట వద్ద వంతెన పనులకు గత ఏడాది మార్చి 22న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు భూమి పూజ చేశారు. వంతెన పనులు ఇప్పటికే 50శాతానికి పైగా పూర్తి కాగా ప్రధాన వంతెన పనులు సైతం చురుగ్గా సాగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాన వంతెన పనుల సమీపంలో ఏటిగట్టుపై గతేడాది ప్రొటోకాల్ ప్రకారం శిలాఫలకం ఏర్పాటు చేశారు. బుధవారం దానిని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, వైసీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆర్భాటంగా ప్రారంభించారు. సర్పంచ్ దంగేటి అన్నవరం మినహా మిగిలిన స్థానిక ప్రజాప్రతినిధులు ఎవ్వరూ హాజరు కాలేదు. అనధికార కార్యక్రమం కావడంతో అధికారులు సైతం దూరంగా ఉన్నారు. ప్రారంభించిన పనులనే మళ్లీ ప్రారంభించి వైసీపీ నాయకులు హంగు, ఆర్భాటం చేశారని ప్రజలు వ్యాఖ్యానించారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏప్రిల్ 5 నుంచి ఆర్ట్స్ కళాశాలలో
రాష్ట్రస్థాయి యూత్ ఫెస్టివల్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 13 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఉద్భవ్ పేరుతో ఏప్రిల్ 5, 6, 7 తేదీల్లో రాష్ట్రస్థాయి యూత్ ఫెస్టివల్ జరగనుంది. కళాశాల ఆవరణలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో యూత్ ఫెస్టివల్‌కు ఉద్భవ్ అనే పేరును నిర్ణయించారు. కళాశాల విద్యార్థిని శివశంకరి ఆధ్వర్యంలో విద్యార్థులు తమ చేతి గుర్తులతో వేసిన బ్యానర్‌ను కళాశాల భవనంపై ఆవిష్కరించారు. విద్యార్థి వ్యాపారాభివృద్ధి (స్టూడెంట్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్) అనే నినాదంతో యూత్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే మాట్లాడుతూ అధ్యాపకుల ప్రమేయం లేకుండా, రాష్ట్రస్థాయిలో విద్యార్థులు నిర్వహించే మొదటి స్టూడెంట్ ఫెస్ట్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ డి.సంజీవ్‌కుమార్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అన్నపూర్ణ, ఫెస్ట్ కో ఆర్డినేటర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వర్చువల్‌గా ప్రధానమంత్రి
సూరజ్ పథకం ప్రారంభం



వర్చువల్‌గా పథకాన్ని ప్రారంభిస్తున్న మోదీ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 13 : ప్రధానమంత్రి సూరజ్ పథకాన్ని బుధవారం సాయంత్రం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన దూరదర్శన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డీవీ ప్రసాద్, సాంఘిక సంక్షేమాధికారి సందీప్ మాట్లాడుతూ సూరజ్ పథకంలో పారిశుధ్య కార్మికులకు జిల్లాలోని కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలో 4 కిట్లు, నిడదవోలు పురపాలక సంఘం పరిధిలో 29 కిట్లు అందజేసినట్టు తెలిపారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ ఆర్థిక సంస్థ ద్వారా ఎస్సీ లబ్ధిదారులకు, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ ఆర్థిక సంస్థ ద్వారా సహాయం పొందిన సఫాయి కర్మాచారి లబ్ధిదారులకు, ఎన్‌బీసీఎఫ్‌డీసీ ద్వారా ఆర్థిక సహాయం పొందిన బీసీ స్వయం ఉపాధి లబ్ధిదారులకు రూ.14,50,68,219ల ఆర్థిక ప్రయోజనం చేకూర్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు పి.సువర్ణ, భానుప్రకాష్, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

గోపాలపురం, మార్చి 13: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని వాహనాన్ని రెవెన్యూ, పోలీస్ సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు. సీఎస్‌డీటీ తాతపూడి దివాకర్, పోలీస్ సిబ్బంది సహకారంతో రూ.2 లక్షల 8 వేలు విలువ చేసే పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకుని వాహనం సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం 11గంటల సమయంలో విధులు నిర్వహిస్తుండగా గోపాలపురం శివారులో ఉన్న పెట్రోల్ బంకు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఐషర్ వ్యాన్ పై పీడీఎస్ బియ్యం తనిఖీల్లో బయటపడ్డాయన్నారు. 130 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.2 లక్షల 8 వేలు ఉంటుందన్నారు. కాకినాడ జిల్లాకు చెందిన అల్లుమల్లు రాముని అదుపులోకి తీసుకుని సీఎస్‌డీటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు.

అనుమతులు లేకుండా మెడిసిన్ విక్రయిస్తే చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

రాజమహేంద్రవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అవసరమైన అనుమతులు పొందకుండా మందులు (మెడిసిన్) విక్రయించడం నేరమని విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. రాజమహేంద్రవరంలోని డ్రగ్స్ విక్రయ సంస్థల పార్శిల్ కార్యాలయాల్లో, గోదాముల్లో బుధవారం తనిఖీలు చేశామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాదాలమ్మనగర్‌లోని ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, టీసీఐ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ పార్శిల్ కార్యాలయాల్లో సోదాలు చేసి ట్రేడ్ లైసెన్సులు లేకపోవడం గుర్తించామన్నారు. వారికి మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నోటీసులు జారీ చేశారని చెప్పారు. శాంపిల్ మందులు ఉండడంతో వాటిని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సీజ్ చేసి నోటీసులు ఇచ్చారన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ముత్యాలునాయుడు, సిబ్బంది వెంకట నాగరాజు, భార్గవ మహేశ్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

పసిబాలుడిని గోనె సంచిలో కట్టి వదిలేశారు..

గమనించి జీజీహెచ్‌కు తరలించిన స్థానికులు



సర్పవరం జంక్షన్, మార్చి 13: ఎవరికి ఏం కష్టమొచ్చిందో..ఏం అడ్డం వచ్చిందో తెలియదు కానీ రోజుల వయస్సు ఉన్న పసిబాలుడిని కాకినాడ బోట్‌క్లబ్ దగ్గర వదిలేసి వెళ్లిపోయారు. కాకినాడ ఒకటో డివిజన్ పరిధిలో బోట్‌క్లబ్ పార్కు ఉంది. దీని ప్రధాన ద్వారం పిఠాపురం వెళ్లే రహదారిలో ఉంది. బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో పార్కులో నుంచి చిన్నారి గుక్కతిప్పుకోకుండా ఏడుస్తున్న విషయాన్ని గమనించిన సందర్శకులు గోనె సంచి మూట విప్పి చూడటంతో రోజుల వయసు ఉన్న బాబు ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. అప్పటికే చిన్నారి నోటి నుంచి నురగలు రావడం, శరీరంపై పొక్కులు రావడాన్ని గమనించి, వెంటనే 108 కు సమాచారం అందించగా, మెరుగైన చికిత్స కోసం చిన్నారి బాలుడిని జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు ఎన్ఐసీయూలో ఉంచి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. చిన్నారి వయసు 3 నుంచి 5 రోజులు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. చిన్నారిని పార్కులో వదిలేసి అప్పటికే 10 నిమిషాలు అయి ఉంటుందని, వెంటనే సందర్శకులు గమనించి సమాచారం ఇవ్వడంతో బాలుడికి ప్రమాదం తప్పిందని వైద్యులు భావిస్తున్నారు. బోట్‌క్లబ్ పార్కు లోపల, బయట వీధికుక్కల గుంపు ఉందని, చిన్నారిని కుక్కలు చూచి ఉంటే పరిస్థితి ఘోరంగా ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

కడియం, మార్చి 13: కడియపులంకలో ఓ పేకాట శిబిరంపై బుధవారం కడియం పోలీసులు దాడి చేశారు. సీఐ బి తులసీధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడియపులంక ఏటిగట్టు ప్రాంతంలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేశామని, ఒక వ్యక్తి పారిపోయాడని తెలిపారు. వారి నుంచి రూ.9,740, ఐదు సెల్ ఫోన్లు, ఐదు మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట శిబిరాలపై నిరంతర నిఘా ఉంచామని ఈ సందర్భంగా సీఐ తులసీధర్ తెలిపారు.

భీమేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.29,46,474



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సామర్లకోట, మార్చి 13: పంచారామ పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఈ నెల 6 నుంచి 11 వరకూ జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల నుంచి హుండీల ద్వారా, పూజా రుసుముల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మొత్తం రూ.29 లక్షల 46 వేల 474 లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం వెల్లడించారు. బుధవారం ఉదయం నుంచి భక్త మండలి కమిటీ ప్రతినిధులు, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. గత ఏడాది ఆదాయంతో పోలిస్తే కేవలం రూ.3.80 లక్షలు మాత్రమే అదనంగా లభించింది. ఉత్సవ ఖర్చులు మాత్రం పెద్ద మొత్తంలో అయినట్లు సమాచారం. మహాశివరాత్రి ఉత్సవాలలో భక్తుల దర్శనాల ద్వారా రూ.9,00,910, సేవలో రూ.92,517, అన్నదానాల విరాళాల ద్వారా రూ.5,05,922, హుండీల ద్వారా రూ.12,00,080, లడ్డూల ద్వారా రూ. 1,42,815, పులిహోర విక్రయాల ద్వారా రూ. 1,04,830 లభించినట్లు తెలిపారు. గత ఏడాది మహాశివరాత్రి ఉత్సవాలకు రూ. 25,26,555 ఆదాయం లభించినట్లు ఈవో నీలకంఠం తెలిపారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడిగా చెల్లుబోయిన

కడియం, మార్చి 13: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు పార్లమెంట్ పరిధి రంపచోడవరం తెలుగుదేశం పార్టీ పరిశీలకుడిగా కడియం మండలం వేమగిరి గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి, జోన్-2 కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాసరావు,(లంకశ్రీను) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు పలువురు అభినందనలు తెలిపారు.

ఏజెన్సీ సమాచారం

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

మోతుగూడెం, మార్చి 13: చింతూరు మండలం మోతుగూడెం ఏపీ జెన్కో డీఏవీ పాఠశాల నందు ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం ఆధ్వర్యంలో డీఏవీ పాఠశాల ప్రాంగనంలో సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో డీఏవీ పాఠశాలలో చదువుతున్న ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు తమ తమ మేధాశక్తితో వివిధ రకాల ఆలోచనలతో పరికరాలను ఉపయోగించి ఈ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. స్థానిక జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ సైన్స్ ఎగ్జిబిషన్ తిలకరించారు. ముఖ్య అతిథిగా ఏపీ జెన్కో సూపరింటెండెంట్ ఇంజనీర్ కె. వెంకటేశ్వరరావు ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యమోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు చేసిన అంశాలను గురించి విద్యార్థులను ప్రసంగించారు. కొత్త విషయాలపై పరిశోధనలు చేస్తూ ఇంకా ముందుకు వెళ్లాలని భవిష్యత్తులో భావితరాలకు ఆదర్శవంతంగా నిలవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డీఏవీ పాఠశాల ఉపాధ్యాయులు అయ్యప్ప, భాను, విద్యార్థుల తల్లిదండ్రులు, వార్డు మెంబర్ మల్లూరు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మలి జాబితాలో రంపకు చోటుందా?

నేటి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థుల జాబితాపై ఉత్కంఠ

రంపచోడవరం, మార్చి13: తెలుగుదేశం పార్టీ గురువారం విడుదల చేసే మలిజాబితాలో పార్టీ అధినేత రంపచోడవరం అభ్యర్థిని ఖరారు చేస్తారా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. ఈ నియోజకవర్గ పరిస్థితులు పార్టీలోని నాయకుల తీరు తెన్నులూ తెలిసిన పార్టీ అధినేత చంద్రబాబు ఇక్కడ అభ్యర్థిని ఖరారు చేయడంలో తీవ్ర కసరత్తుతో ఒడబోత చేశారు. వివిధ కోణాల్లో ఆయా ఆశావహుల బలాబలాలను పరిశీలించిన ఆయన ఇప్పటికే ఒక అభిప్రాయానికి వచ్చారని తెలిసింది. ఈ నియోజకవర్గంలో ఎక్కడా లేనంతగా ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు టికెట్ కోసం పోటీ పడటం, అదే క్రమంలో కొత్తవారు కూడా టికెట్‌ను ఆశించడంతో గత మూడు ఎన్నికలుగా ఇక్కడి ఓటమికి గల కారణాలను కూడా చంద్రబాబు తన సర్వేలలో అంచనా వేయడంతో ఎవరి సరైనవారన్న నిర్ధారణకు వచ్చారు. కాగా భౌగోళికంగా పెద్ద నియోజకవర్గంగా 11 మండలాలలో విస్తరించిన ఈ సెగ్మెంట్‌లో అభ్యర్థిని ఖరారు చేయడంలో చోటు చేసుకున్న జాప్యం క్యాడర్‌ను ఆందోళనకు గురి చేస్తోంది. అభ్యర్థి ఎవరైనప్పటికీ సమయాభావంతో సదరు అభ్యర్థి అన్ని ప్రాంతాల్లో పర్యటించడం సాధ్యంకాని పరిస్థితులపైనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితిని గుర్తించిన అధిష్ఠానం నేటి జాబితాలో రంపచోడవరం అభ్యర్థిని ఖరారు చేసే అవకాశాలు మెండుగానే ఉన్నాయి. అయితే అభ్యర్థిత్వంపై ఆశావహుల్లో ఎవరి ఊహలు వారికి ఉన్నాయి. అభ్యర్థిత్వం ఎవరికి ఇవ్వాలన్న అంశంలో పాత-కొత్త మధ్య విజయావకాశాలను బేరీజు వేసి ఖరారు చేస్తారని తెలుస్తోంది.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

చింతూరు, మార్చి 13: తమ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని తుమ్మల గ్రామస్థులు బుధవారం గ్రీవెన్స్‌లో చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీఎం గ్రామ కార్యదర్శి మొట్టుం రాజయ్య మాట్లాడుతూ ఏడాది కాలంగా జిల్లేడు గుంపులో తాగునీటి సమస్య ఉందని దీంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినా పట్టించుకోలేదన్నారు. సచివాలయంలో నిధులు లేవని నిధులు లేమితో పనులు ఎలా చేయాలని అధికారులు చేతులెత్తేస్తున్నారని చెప్పారు. పీవోను కలిసిన వారిలో లెనిన్, విజయ్‌కుమార్, కూర మహేష్, కమలేష్ తదితరులు ఉన్నారు.

ముస్లింలకు నిత్యావసర సరుకులు



సరుకులు అందిస్తున్న జమాల్‌ఖాన్

చింతూరు, మార్చి 13 : రంజాన్ సందర్భంగా బుధవారం జేకే ట్రస్టు ఆధ్వర్యంలో 50 ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేకే ట్రస్టు ఛైర్మన్ జమాల్ ఖాన్ మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా దీక్షలు చేపట్టిన కుటుంబాలకు తమ ట్రస్టు ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సయ్యద్ సుభానీ, ఇమ్రాన్‌ఖాన్, అఖిల్, అజీజ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగులు వైసీపీ కార్యకర్తల్లా పనిచేస్తున్నారు'

. చింతూరు, మార్చి 13 : రంపచోడవరం నియోజకవర్గ పరిధిలో వైసీపీ నాయకులు ఉద్యోగులను తమ పార్టీ కార్యకర్తలు మాదిరిగా వినియోగించుకుంటున్నారని, కొంత మంది అధికారులు, ఉద్యోగులు కూడా పార్టీ పనుల విషయంలో అత్యుత్సాహం కనబరుస్తున్నారని చింతూరు మండల టీడీపీ అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి ఆరోపించారు. విలేకర్లతో బుధవారం ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ప్రభుత్వ అధికారులను, ఉద్యోగులను తమ పార్టీ పనులకు వినియోగించుకోవడం. అదే దశలో ఉద్యోగులు కూడా అత్యుత్సాహంతో పార్టీ పనుల్లో పాలు పంచుకోవడం చట్టరీత్యా నేరమని, రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏనాడు పార్టీ పనులకు ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకోలేదన్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, పించను సొమ్ములు కోసం విశ్రాంత ఉద్యోగులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వైసీపీ ప్రభుత్వంలో ఉందన్నారు. అలవెన్సులు సైతం ఉద్యోగులకు సకాలంలో వైసీపీ ప్రభుత్వం చెల్లించలేకపోవడం దురదృష్టకరమన్నారు.

కొమరిపాలెంలో మినీ వాటర్ ప్లాంట్ ప్రారంభం

బిక్కవోలు, మార్చి 13: కొమరిపాలెం గ్రామంలో గ్రాసిం ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్మించిన మినీ వాటర్ ప్లాంట్‌ను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, జెడ్పీటీసీ రొంగల పద్మావతి, సర్పంచ్, ఉపసర్పంచ్‌లు వాసంశెట్టి రవికుమార్, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి, పంచాయితీ కార్యదర్శి సత్తి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సమాజం పట్ల నిబద్ధత కలిగిన పార్టీ టీడీపీ

● టీడీపీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు స్వామిదాసు



సూపర్ సిక్స్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 13: రాష్ట్రంలోని క్రైస్తవ సమాజం పట్ల టీడీపీ ఎల్లప్పుడు కృతజ్ఞత భావం కలిగి ఉందని ఆ పార్టీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటే స్వామిదాసు అన్నారు. రాజమహేంద్రవరం టీడీపీ కార్యాలయంలో బుధవారం సూపర్ సిక్స్ పథకాల పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్‌లతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం స్వామి దాసు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలోనే క్రైస్తవులకు మేలు జరిగిందన్నారు. క్రైస్తవులను నమ్మించిన జగన్ అధికారంలోకి వచ్చాక మోసం చేశాడన్నారు. ప్రతి క్రైస్తవుడు తన జీవితంలో ఒక్కసారైనా జేరుసలేం యాత్ర చేయాలని ఉంటుందని దానిని చంద్రబాబు నేరవేర్చుతూ యాత్ర పథకం పెడితే అధికారంలోకి వచ్చాక జేరుసలేం యాత్ర పథకానికి మంగళం పాడేశాడని మండిపడ్డారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 277 చర్చిల అభివృద్ధికి రూ.45 కోట్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. క్రైస్తవులకు రాష్ట్ర బడ్జెట్‌లో వెయ్యికోట్లు కేటాయించినట్టు చెప్పారు. ప్రతి ఏడాది క్రిస్మస్ కానుకను డిసెంబరులో చంద్రబాబు అందించారని, విదేశాల్లో ఉన్నత విద్య అవకాశాలు కల్పించారన్నారు. రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ మాట్లాడుతూ పాస్టర్లకు గౌరవ వేతనం కొనసాగించడం జరుగుతుందన్నారు. క్రైస్తవులు పోగొట్టుకున్న పూర్వవైభవం కావాలంటే తిరిగి టీడీపీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు రెడ్డి మణి, ఎస్సీసెల్ అధ్యక్షుడు చాపల చిన్నరాజు, టీడీపీ నాయకులు మదీనా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

● అనపర్తి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



ఊలపల్లిలో టీడీపీలోకి చేరుతున్నవారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, మార్చి 13: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధితోపాటు సంపద సృష్టించాలంటే చంద్రబాబుతోనే సాధ్యపడుతుందని అనపర్తి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బిక్కవోలు సెయింట్ థామస్ చర్చ్‌లో మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రార్థనల కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం తొస్సిపూడి బ్లెస్సింగ్ గాస్పల్ మినిస్ట్రీస్ చర్చ్‌లో జరుగుతున్న ప్రార్థనల్లో రామకృష్ణారెడ్డి పాల్గొని వారి మద్దతు కోరారు. కార్యక్రమంలో జిల్లా క్రిస్టియన్ సెల్ ప్రధాన కార్యదర్శి విజయరావు, మండల పార్టీ అధ్యక్షుడు వేణుగోపాలరెడ్డి, దేశం నేతలు కర్రి శ్రీనివాసరావు, పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, రాయుడు రామచంద్రరావు, దేవానందరెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఊలపల్లిలో వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

ఊలపల్లి గ్రామంలో మంగళవారంరాత్రి అనపర్తి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శెట్టిబలిజ సంఘాలు, అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశంలో గ్రామానికి చెందిన వైసీపీ నేతలు, పంచాయతీ మెంబర్ పాలిక రమణ, మేడిశెట్టి వెంకటరమణ, శ్రీను, కొశెట్టి సత్యం, పిల్లి మణికంఠ, కళా నాగేంద్రకుమార్, తోట నరేంద్ర, కోశెట్టి సాయి రామ్‌లతోపాటు 20 కుటుంబాలు తెలుగుదేశంపార్టీలో చేరా రు. వీరికి రామకృష్ణారెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నురుకుర్తి వెంకటేశ్వరరావు, బిక్కవోలు పీహెచ్‌సీ మాజీ ఛైర్మన్ సురేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొండా వినయ్, ముల్లంగి పెదబాబు, దేశం, జనసేన నేతలు కార్యకర్తలు శెట్టిబలిజ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మర్రిపూడిలో మహాలక్ష్మి ప్రచారం

రంగంపేట, మార్చి, 13 : రంగంపేట మండలం మర్రిపూడి గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి నల్లమిల్లి మహాలక్ష్మీ టీడీపీ జాతీయ అధ్యక్షు డు నారాచంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల ద్వారా మహాశక్తి కార్యక్రమం ద్వారా పొందే లబ్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ, మండల టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రంగంపేట: మర్రిపూడిలో మహిళల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మహాలక్ష్మీ

'కుమార్ మాస్టారు సేవలు మరువలేనివి'



స్వచ్ఛంద పదవీ విరమణ చేసినకుమార్ మాస్టారును సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

కోరుకొండ, మార్చి 13: ఎం.ఎస్.ఎస్.వీ.వీ.ఎస్.వై.పి.కుమార్ మాష్టారు సేవలు ఉపాధ్యాయ లోకానికి ఆదర్శప్రాయమని 38 సంవత్సరాల సర్వీసులో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత మాష్టారుకే దక్కుతుందని కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్ గెజిటెడ్ హెడ్ మాస్టార్ ఎంఎస్ మణికుమార్ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం కోరుకొండ ప్రభుత్వ హైస్కూ ల్లో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యాకమిటీ కుమారు మాస్టారు దంపతులను ఘనంగా సత్కరించారు. 1986లో రాజానగరం మండలం శ్రీరాంపురం గ్రామంలో డీఎంఆర్ ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించిన కుమార్ మాష్టారు అదే పాఠశాలలో 2017లో సాంఘిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. 2022లో ఆ పాఠశాల ప్రభుత్వంలో కలవడంతో 2023 కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్లో సాంఘిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్‌గా జాయిన్ అయ్యారు. 38 సంవత్సరాల సుదీర్ఘ సర్వీసు అనంతరం మరో 18 నెలలు సర్వీసు ఉన్నప్పటికీ కుటుంబంతో ఎక్కువగా గడపాలన్న ఆలోచన, ఆరోగ్య కారణాలు రీత్యా ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు,గ్రామపెద్దలు, విద్యా కమిటీ సభ్యులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర పాత్రుడు, స్టాఫ్ సెక్రటరీ సత్యానందం, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డానియేల్‌బాబు, రవికుమార్, రాజేశ్వరి, రాధామణి, ఆనంద్‌బాబు, మాజీ సర్పంచ్ వాకా నరసింహారావు, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు కవయిత్రి మొల్లమాంబకు ఘన నివాళి



మొల్లమాంబ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 13 : రామాయణ గ్రంథాన్ని పామరులకు సైతం అర్థమయ్యేరీతిలో మొల్ల రచించారని కలెక్టర్ పేర్కొన్నారు. తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ 585వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. బుధవారం ఉదయం కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత , జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 16వ శతాబ్దానికి చెందిన తెలుగు కవయిత్రి మొల్ల మాంబ జయంతిని నిర్వహించుకోవడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరం గౌతమి ఘాట్‌లో ఉన్న మొల్లమాంబ విగ్రహానికి జిల్లా బీసీ సంక్షేమ అధికారి పిల్లి సత్యరమేష్, కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర నాయకులు పేరూరి గంగాధరం, మెరుగుమిల్లి సత్యనారాయణ, రాష్ట్ర ప్రచార కమిటీ ఛైర్మన్ దాలిపర్తి వేమన పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. పరిపాలనాధికారి సత్యకుమార్, సూపరింటెండెంట్ కేవీవీ సత్యనారాయణ, డాక్టర్ అభిషేక్, మౌనిక, సుధీర్, ఏసుబాబు, రజియా, జాన్సన్ రాజు, రాయపూడి శ్రీనివాస్, జుజ్జవరపు కాశేశ్వరరావు, పేరూరి శేషాద్రి,దేవగుప్తాపు లక్ష్మణరావు, బాలాజీ పాల్గొన్నారు.

అనపర్తి ఏరియా ఆసుపత్రిలో నాసిరకం భోజనం సరఫరాపై చర్యలు చేపడతాం

● ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామగుర్రెడ్డి

అనపర్తి, మార్చి 13 : అనపర్తి ఏరియా ఆసుపత్రిలో రోగులకు అందించే భోజ నం నాసిరకంగా ఉందని బుధవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి స్పందించారు. బుధవారం ఆసుపత్రి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు నాసిరకం భోజనం సరఫరా జరుగుతుందన్న సమాచారం తమకు అందిం దని తరచుగా భోజనం పరిశీలిస్తున్నామని గతంలో ఒకటి రెండుసార్లు కాంట్రా క్టరుతో భోజనంపై వస్తున్న ఫిర్యాదులను వివరించామన్నారు. పరిస్థితిని ఉన్నతా ధికారులకు వివరించామని వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని అన్నా రు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి రెండుపూటలు అందించాల్సిన భోజనం కేవలం ఒక్కపూటతో ఎందుకు సరిపెట్టాల్సి వస్తుందని ప్రశ్నించగా జిల్లాలో కొన్ని ఆసుపత్రుల్లో ఈ సమస్య ఉందని కాంట్రాక్టరుకు మెనూకు సరిపడ బిల్లులు అందక పోవడంతో ఒక్కపూట భోజనం మాత్రమే పెట్టడం వాస్తవమని దీనిపై మెనూకు సరిపడా బిల్లుల చెల్లింపుకు ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. పద్మశ్రీ ఆసుపత్రి ఎడ్మినిస్ట్రేటర్ డాక్టర్ తరుణ్ పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో గైట్ విద్యార్థికి రజతం



రాజానగరం, మార్చి 13: అఖిలభారత అంతర్ విశ్వవి ద్యాలయాల కిక్ బాక్సింగ్ పోటీల పురుషుల విభాగంలో గైట్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ఎ.సుమంత్‌కుమార్ చక్కటి ప్రతిభకనపర్చి రజత పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సి పాల్ ఎంవీ శేఖర్‌బాబు తెలిపారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ బాబు మాట్లాడుతూ గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న సుమంత్‌కుమార్ ఉత్తరప్ర దేశ్‌లోని మీరట్‌లో ఇటీవల జరిగిన అఖిలభారత అంతర్ విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ పోటీల్లో జెఎన్టీయు జట్టులో పాల్గొని చక్కటి ప్రతిభ కనబర్చి ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకం సాధించారన్నారు. ఈకార్యక్రమంలో గైట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వ్యాయామ అధ్యాపకుడు పీవీ రమేష్ వివిధ విభాగాల అధిపతులు పాల్గొని సుమంత్‌కుమార్‌ను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బిక్కవోలు, మార్చి 13: బలభద్రపురం విద్యుత్ సబ్ స్టేషన్ నందు కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల బలభద్రపురం, కాపవరం, గంగులూరి పాకలు, పరిశ్రమలకు విద్యుత్‌ను ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకూ నిలుపుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

పేదలకు మంచి చేసే పార్టీకే మద్దతు

● కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు త్రినాథరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న త్రినాథరెడ్డి

అనపర్తి, మార్చి 13 : ఓసీ కులాలంటే ధనికులని ముద్రపడిపోవడంతో ఓసీ కులాల్లో కడు పేదరికంలో ఉన్న కులాలను ఏ రాజకీయపార్టీలు, ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డి అన్నారు. బుధవారం అనపర్తిలోని టీజీఆర్‌ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓసి కులాలలో అనేకమంది పేదలు ఉన్నారని వారిని ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికల లో ఓసీలలో ఉన్న పేదలకు సంక్షేమం అందించే పార్టీకే తమ మద్దతు ప్రకటిస్తామన్నారు. అగ్రవర్ణాలలో ఉన్న పేదలకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందిస్తారో వారి మేనిఫెస్టోలో పెట్టాలని అలా పెట్టిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని అన్నారు. ఓసీ కులాల్లో పేదలు అటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఏ ప్రభుత్వాలు పట్టించుకోక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి సత్తి వీర్రెడ్డి మాట్లాడుతూ మిగిలిన కులాలలో పేదలకు ఎటువంటి సంక్షేమం అందిస్తున్నారో అదేవిధంగా అగ్రకులాల పేదలకు అందించాలని కోరుతున్నా మని అన్నారు. త్వరలోనే ఓసీలోని అన్ని కులాలతో సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందించి మద్దతుపై ప్రకటన చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం యువజన విభాగపు అధ్యక్షుడు తాడి చంద్రశేఖరరెడ్డి, నల్లమిల్లి వినురెడ్డి, ఆదిరెడ్డి, నాగురెడ్డి, పడాల సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడియం నర్సరీలకు ప్లాంట్ క్వారంటైన్ సెంటర్ కావాలి

కడియం, మార్చి 13: జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో తెలంగాణా రాష్ట్ర ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డితో చాగల్లు మండలం మల్లవరం గ్రామంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బొర్సు సుబ్రహ్మణ్యం రైతు సంక్షేమం కోసం సూచనలు చేశారు. కడియం నర్సరీలకు విదేశీ మొక్కల ఎగుమతులు, దిగుమతులు కోసం క్వారంటైన్ సెంటర్ మెనిఫెస్టోలో రూపొందించాలని పైడి రాకేష్‌రెడ్డిని కోరారు.



రాకేష్‌రెడ్డికి మొక్కను అందచేస్తున్న బొర్సు సుబ్రహ్మణ్యం

కూటమి గెలుపు చారిత్రక అవసరం

● మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 13: జగన్ పాలనలో దెబ్బతిన్న వ్యవస్థలన్నింటిని గాడిన పెట్టి రాష్ట్రాన్ని గెలిపించడానికే టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు అని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ పాలనలో రాష్ట్రం 25 ఏళ్ల వెనక్కుపోయిందన్నారు. నష్టపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు దుష్పాలన అంతం చేయడానికి మూడు పార్టీలు కలిసి పోటీ చేస్తున్నాయన్నారు. వైసీపీ అరాచకపాలకు చరమగీతం పాడాలన్నారు. కూటమి గెలుపు చారిత్రక అవసరమని స్పష్టం చేశారు. ఈనెల 17న చిలకలూరిపేటలో జరిగే సభ కొత్త చరిత్ర సృష్టిస్తుందన్నారు.

కుటుంబాలకు మహిళలు మార్గదర్శకంగా ఉండాలి

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి



సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మహిళలు వారి కుటుంబాలకు మార్గదర్శకంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. డీఎల్ఎస్ఏ, భూమిక ఎన్జీవో సంయుక్త ఆధ్వర్యంలో అన్నపూర్ణమ్మపేట సమీపంలో మహిళల సాధికారత, మహిళల చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లలను తీర్చిదిద్ది వారిని మంచి మార్గంలో నడిపించడంలో, కుటుంబ బాధ్యతలు నిర్వర్తించడంలో మహిళల పాత్ర ముఖ్యమైనదన్నారు. ఇంట్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పడంలో మహిళలు విఫలమైతే కుటుంబ సభ్యులు, పిల్లలపై ఆ ప్రభావం పడుతుందన్నారు. పిల్లలకు స్వేచ్ఛనివ్వడం ఎంత ముఖ్యమో.. వారి మంచి చెడులను గమనిస్తూ ఉండడం కూడా అంతే ముఖ్యమని చెప్పారు. ఆడ పిల్లలను కచ్చితంగా చదివించాలని పిలుపునిచ్చారు. మహిళల హక్కుల పరిరక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటి కోసం మహిళలు ధైర్యంగా నిలవాలన్నారు.

బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి

● గైనకాలజిస్ట్ డాక్టర్ వరలక్ష్మి



నారీ శక్తి ఫిట్‌నెస్ రన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులు

అనపర్తి, మార్చి 13: ఆడపిల్లలలో ఏర్పడే జన్యు లోపాలను అధిగమించేందుకు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని అనపర్తి ఏరియా ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ వరలక్ష్మి అన్నారు. బుధవారం అనపర్తిలోని సాయిమాధవి డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నారీశక్తి పిట్నెస్ రన్స్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ మణికుమారి ప్రసంగిస్తూ ఆడపిల్లలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనాలని పిట్‌గా ఉండేందుకు తగిన వ్యాయామం చేయాలని అన్నారు. మాజీ ఎంపీపీ కొవ్వూరి పార్వతి మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల ధైర్య సాహసాలతో జీవనం సాగించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరుగు పందెంలో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకె కేంద్ర సెంట్రల్ వలంటీర్ శాంతికుమారి, ఎమ్ఎస్ఆర్ విద్యా సంస్థల ఛైర్మన్ మల్లిడి అనంతరెడ్డి, పిన్సిపల్స్ నవీన్, రామభద్రారెడ్డి, బ్లడ్ ఆర్గనైజర్స్ రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి సరికొత్త క్రెటా ఎన్‌లైన్ కారు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 13: రాజమహేంద్రవరం మార్కెట్‌లోకి కార్లదిగ్గజమైన హుండయ్ సరికొత్తగా క్రెటా ఎన్ లైన్ కారును విడుదల చేసింది. రాజమహేంద్రవరం హుండయ్ షోరూమ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమానికి జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ ఛైర్మన్ డాక్టర్ గన్నిబాస్కరరావు హాజరై నూతన కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. కారు ఆరు సరికొత్త ఆకర్షణీయమైన రంగుల్లో లభ్యమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ ,వీరేష్, రవికుమార్, కోటేశ్వరరావు , సీహెచ్ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హుండయ్ క్రెటా ఎన్‌లైన్ కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: భీమా
సూర్యామినీ	: సైతాన్
సూర్యాప్యాలస్	: ఊరుపేరు భైరవకోన
స్వామి	: భీమా
శివజ్యోతి	: భీమా
అనుశ్రీ(సాయికృష్ణ)	: ప్రేమలు
రాజా	: భీమా
ఊర్వశి	: హనుమాన్
రంభ	: రికార్డు బ్రేక్
మేనక	: బాబు నెం.1, బుల్ షిట్..
అప్సర	: గామి
కుమారి	: గామి
వీఎస్ మహాల్(నామవరం)	: భీమా
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: గామి
వెంకటసూర్య(కడియం)	: భీమా
సత్యగౌరి (అనపర్తి)	: భీమా
సూర్యశ్రీ (అనపర్తి)	: ఊరుపేరు భైరవకోన
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: గామి
రామకృష్ణ(కోరుకొండ)	: భీమా
గీతాసినిమాస్ (సీతానగరం)	: భీమా
శ్రీనివాస (గోకవరం)	: భీమా
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఊరుపేరు భైరవకోన
లలితామహాల్(రంపచోడవరం)	: భీమా
నవయుగ(చింతూరు)	: భీమా

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు)	సా.6.21
సహరి(శుక్ర)	ఉ.4.50

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	38.0	24.0



నేడు టీడీపీ రెండో జాబితా

- నేడు అధికారికంగా ప్రకటించనున్న చంద్రబాబు
- రాజమహేంద్రవరం రూరల్‌కు గోరంట్ల?
- గోపాలపురం అభ్యర్థిని ప్రకటించే అవకాశం
- కొవ్వూరు అభ్యర్థి ఎవరో?

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

నాయకుల ఎదురుచూపులకు నేడు తెరపడనుంది. తెలుగుదేశం పార్టీ రెండో జాబితాను గురువారం 4 గంటలకు ప్రకటించనుంది. ఈ జాబితాలో జిల్లాలోని పెండింగ్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తారనే ఆశాభావంతో అభ్యర్థులు, నియోజకవర్గాల పార్టీ శ్రేణులు, ప్రజలు ఉన్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. నిడదవోలు,రాజానగరం రెండు స్థానాలను జనసేనకు కేటాయించిన సంగతి తెలిసిందే. నిడదవోలుకు ఉమ్మడి అభ్యర్థిగా కందుల దుర్గేష్, రాజానగరం నుంచి ఉమ్మడి అభ్యర్థిగా బత్తుల బలరామకృష్ణను ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలుగుదేశం పార్టీ తొలిజాబితాలో ఇప్పటికే రాజమహేంద్రవరం సిటీ ఆదిరెడ్డి వాసు, అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్లను ప్రకటించారు. రాజమహేంద్రవరం రూరల్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేరు ఖరారైనట్టు తెలిసింది.రెండో జాబితాలో ఆయన పేరును అధికారికంగా ప్రకటించనున్నారు. ఇక మరో రెండు స్థానాలు గోపాలపురం, కొవ్వూరు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. గోపాలపురం నియోజకవర్గం టిక్కెట్ డైలమాలో పడింది. ఈ నియోజకవర్గం నుంచి మంగళవారం చంద్రబాబు గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండల పార్టీ అధ్యక్షులు,ఇద్దరు స్టేట్ కమిటీ సభ్యులు, ప్రస్తుత ఇన్‌చార్జి వెంకట్రాజు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజును పిలిపించి నేరుగా మాట్లాడిన సంగతి తెలిసిందే. అయితే మద్దిపాటి వెంకట్రాజు పేరునే ప్రకటిస్తారనే ప్రచారం జరుగుతోంది.ఈ అభ్యర్థి మార్పు ఉంటుందని మరో వర్గం ప్రచారం చేస్తోంది.. ఇదిలా ఉండగా గోపాలపురం నియోజకవర్గంలో బుధవారం ఐవీఆర్ఎస్ (ఇన్‌ట్రాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా టీడీపీ అధిష్ఠానం సర్వే చేయించింది. దీంతో ఇక్కడి అభ్యర్థిని కూడా రెండో జాబితాలో ప్రకటించే అవకాశం ఉంది. ఇక కొవ్వూరు నియోజక వర్గంలో అభ్యర్థి తేలాల్సి ఉంది. కొవ్వూరు పార్టీ నాయకులు పెండ్యాల అచ్చిబాబు,ద్విసభ్య కమిటీ సభ్యులు చౌదరి, రామకృష్ణలతో కూడా చంద్రబాబు మాట్లాడిన సంగతి తెలిసిందే.ఇక్కడ నుంచి పోటీ చేయడానికి మాజీ మంత్రి జిల్లా పార్టీ ప్రెసిడెంట్ కెఎస్.జవహర్ ప్రయత్నిస్తున్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ఇక్కడ అచ్చిబాబు వర్గం విబేధిస్తోంది.ఈ నేపథ్యం లో చంద్రబాబుతో చర్చలు ఏమి జరిగాయో కానీ నిర్ణయాన్ని అధిష్ఠానా నికి వదిలినట్లు ఇక్కడ ప్రచారం జరిగింది.ఈ నేపథ్యంలో ఇక్కడ అభ్యర్థి ఎవరనేది ఉత్కంఠను రేపుతోంది. కెఎస్.జవహర్, ఆయన కుమారుడు, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు,వాసుదేవరావు వంటివార్ల పేర్లు పరిశీలనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. వీరిలోనే అభ్యర్థులు ఉంటారా? లేక వేరే వారు ఉంటారా అనేది రెండో జాబితాలో తేలిపోయే అవకాశం ఉంది.లేదా ఒకట్రెండురోజులుఆగవచ్చు. సాధారణంగా నియోజకవ ర్గంలో పెద్దలతో చర్చించిన తర్వాత అభ్యర్థి ఖరా రయ్యే అవకాశాలే ఎక్కువ.ఇదిలా ఉండగా రేపోమాపో ఎన్నికల షెడ్యూల్ కూడా వచ్చేస్తోంది.

ఐదేళ్లకు గుర్తొచ్చామా!





ఎప్పుడేశారబ్బా? : రాజమహేంద్రవరం ఎల్‌బీ శాస్త్రిరోడ్డు అనుసంధాన రహదారుల్లో నిర్మించిన నూతన సీసీ రోడ్డు

ఎందుకీ హడావుడి శంకుస్థాపనలు

- ఎడాపెడా శంకుస్థాపనలు
- ఎక్కడికక్కడ శిలాఫలకాలు
- 7 నియోజకవర్గాల్లోనూ ఇంతే
- రాష్ట్ర ప్రభుత్వ నిధుల మాటే లేదు
- కేంద్ర, సాధారణ నిధులతోనే పనులు
- వైసీపీ నాయకుల ఆర్భాటం
- ప్రచార యావకు పరాకాష్ట
- ఐదేళ్లుగా ఏమయ్యారని ఓటర్ల ప్రశ్న

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీకి ప్రజలు అధికారం ఇచ్చి సుమారు 4 ఏళ్ళ 10 నెలలైంది. ఇన్ని రోజులు ముఖ్యమంత్రి జగన్‌తో సహా ఆయన మంత్రివర్గం, ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరు మొద్దునిద్రలో ఉన్నారు. అందుకే రాష్ట్రంలో రహదారులు, డ్రైనేజీలు, సురక్షిత తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాల కల్పన కూడా పూర్తిస్థాయిలో చేయలేకపోయారు. పుణ్యకాలం కాస్త అయిపోతున్న తరుణంలో ప్రజలను ఓట్లు అడిగేందుకు ఏ ముఖంపెట్టుకుని వెళ్లాలనే ఆలోచనతో ఆగమేఘాలపై హడావుడి పనులు చేస్తున్నారు.. శిలాఫలకాలు వేస్తున్నారు..ఈ ఐదేళ్లుగా రోడ్లు, డ్రైన్లు, పార్కులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పుడు మళ్లీ ఎన్నికల వేళ వైసీపీ నాయకులు ప్రారంభోత్సవాలతో ఊదరగొట్టేస్తున్నారు. ఇంత కాలం జిల్లా అభివృద్ధిని గాలికొదిలేసి ఇప్పుడు ఓట్ల కోసం వైసీపీ నాయకులు అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. ఇదంతా ఎన్నికల స్టంట్ అనేది ప్రజలకు అర్థమౌతుంది.

ఐదేళ్లుగా పట్టలేదు..

రోడ్లపై తిరగలేక జనం ఐదేళ్ల నుంచీ నరకం అనుభవించారు.పట్టణాల్లో, గ్రామాల్లో డ్రైన్లు పట్టించుకున్న నాథుడు లేడు. ఇప్పుడు వైసీపీ నాయకుల్లో ప్రచార యావ మాటున ప్రారంభోత్సవాలు ఉరకలు పెడుతుండడం విస్మయానికి గురిచేస్తోంది.జిల్లా కేంద్రంలో కూడా అదే దుస్థితి. శివారు ప్రాంతాల్లో పందుల స్వైరవిహారం, దోమలు, చెత్త సేకరణ లేకపోవడం, వీధిలైట్లు వెలగక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ గడప గడపకూ కార్యక్రమంలో గుర్తించిన పనులకు ఇంకా అతీగతీ లేదు. కానీ ఎన్నికల వేళ కొత్త పనుల పేరుతో శిలాఫలకాలు కట్టేసి కొబ్బరికాయల మోత మోగిస్తున్నారు. ఈ ఖర్చులు అధికారులపైనే రుద్దుతున్నారని తెలుస్తోంది. దీంతో 'గాలి' పనులకు ఇంత ఆర్భాటమెందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎక్కడికక్కడ బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. వైసీపీ నాయకుల ఒత్తిడితో అధికారులు వెళ్లి కాంట్రాక్టర్లను బతిమలాడుతున్నారు. ఐదేళ్లలో ఇప్పుడు గుర్తొచ్చామా అంటూ వైసీపీ పాల కులను కాంట్రాక్టర్లూ ప్రశ్నిస్తున్నారు. శిలాఫలకాలు చూసి రాష్ట్ర ప్రభుత్వం నిధులిచ్చిందేమో అనుకోవద్దు సుమా.. ఒక్క రూపాయి విడుదల చేయలేదు. మరి శిలాఫలకాలు ఎందుకంటారా.. మళ్లీ వచ్చే ఐదేళ్లకు..

ఇప్పుడే ఎందుకింత ప్రేమంట?

ఎక్కడైనా ఒక్కో నాయకుడిదీ ఒక్కో తీరు ఉంటుంది.. జిల్లాలో వైసీపీ నాయకులందరిదీ ఒకటే తీరు. ఎందుకంటే ఎన్నికల వేళ నాయకులందరికీ ప్రజలపై ఒక్కసారిగా ప్రేమ పెరిగిపోయింది. ఎంతంటే సమస్యలు గుర్తించి హడావుడి ప్రారంభోత్సవాలు చేసేటంత.. ఒకసారి అవేంటో చూద్దాం.. ప్రారంభోత్సవాల ప్రాపకంలో మంత్రి వేణు మునిగి తేలుతున్నారు. జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి అయినా అధికా రంలోకి వచ్చాక ఇన్నాళ్లూ కన్నెత్తి కూడా చూడలేదు. ప్రస్తుతం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఇన్ చార్జి కావడంతో శివారు ప్రాంతాల్లో సంచరిస్తూ డ్రైన్లు, రోడ్ల పనులకు కొబ్బరికాయలు కొడుతున్నారు. ఈ పనులు ఎప్పటి పూర్తవుతాయో ఆయనకే తెలియాలి. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మాణాలు పూర్తయిన వాటికి రిబ్బన్లు కత్తిరిస్తున్నారు. రాజమహేంద్రవరం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ముందునుంచీ ఎంపీ భరత్‌రామ్ తానేరాజు తానే మంత్రి అనే చందంగా వ్యవహరిస్తుండడం తెలిసిందే. అనవసరమైన అలంకరణలకు అభివృద్ధి పేరు పెట్టి జనాల కళ్లకు గంతలు కట్టే ప్రయత్నం యథేచ్ఛగా చేస్తున్నారు. నాటిన మొక్కలకు, నాటుతున్న వాటికి లెక్కా పత్రం ఏమీ లేదు. కార్పొరేషన్ నిధులను మట్టిలో పోస్తున్నారు. పార్కుల్లో, రోడ్లపక్కన లైటింగ్ పెట్టడానికి, జంక్షను పాయింట్లను కుచించడానికే ఎంపీ పరిమితమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. మోరంపూడి ఫ్లైఓవర్ ఎంపీగా మురళీమోహన్ ఉన్నప్పుడే మంజూరైనా ఎంపీ భరత్ తన ఖాతాలో వేసేసుకున్నారు. ఎంపీ ఆర్భాటాలకు ఖర్చు చేస్తున్న సొమ్ముతో నగరాన్ని పట్టిపీడిస్తున్న డ్రైనేజీ సమస్య నుంచి బయట పడేయొచ్చు. శివారు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లులేని ఏరియాలు చాలానే ఉన్నాయి. నగరంలో నాలుగు పార్కుల్లో జిమ్మిక్కుల లైటింగ్ పెట్టి ఎలక్షన్ స్టంటును ఎంపీ భరత్ రక్తికట్టిస్తున్నారే విమర్శ లకు కొదువలేదు. ఐదేళ్ల కాలంలో ఎంపీ స్థాయిలో ఆయన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెప్పుకొనే స్థాయిలో నిధులూ లేకపోవడం గమనార్హం. కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కూడా సచివాల యాలు తదితర ప్రారం భోత్సవాల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. గడప గడపకూ 82 పనులు ప్రారంభించగా అందులో కేవలం 15 పనులే పూర్తయ్యాయి.వాటికీ బిల్లులు వస్తాయనే నమ్మకం కాం ట్రాక్టర్లకు లేదు.దీంతో పనులు చేయడానికి ఎవరూ ముం దుకు రావడం లేదు. కొవ్వూరు మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్న కుమారి పలు రోడ్లు, డ్రైన్లకు, పెనకనమెట్లలో రోడ్లు,డ్రైన్లకు పట్టాభిరామారావు ఆధ్వర్యంలో కొబ్బరి కాయలు కొట్టారు. కానీ నిధులే కరువయ్యాయి. కొవ్వూరు టౌన్ మోడల్ పోలీస్ స్టేషన్‌కు మంత్రి తానేటి వనిత బుధవారం ప్రారంభించారు.ఆమె రాజకీయ బదిలీపై గోపాల పురం వెళ్లినా హోంమంత్రి హోదాలో స్టేషన్ ప్రారం భోత్సవం చేశారు.రాజానగరం నియోజకవర్గంలో జూని యర్ కళాశాల హామీ ఇప్పటికీ నెరవేరలేదు. ఈ నియో జకవర్గంలో అధిక శాతం రోడ్లు, డ్రైన్లు టీడీపీ హయాం లోనే పూర్తయ్యాయి. దీంతో హంగు కోసం కొన్ని ప్రారం భోత్సవాలు చేస్తున్నారు. ఈ నెల 12న కలవచర్లలో పారి శ్రామికవాడకు కొబ్బరికాయ కొట్టారు. ఈ నిధులు కేంద్ర ప్రభుత్వానివి. కార్యరూపం ఎప్పుడు దాలుస్తుందో వేచి చూడాల్సిందే. ఏడీబీ రోడ్డు గత నాలుగున్నరేళ్లుగా అలాగే ఉంది.అయినా పట్టించుకున్న నాథుడే లేడు. రివర్స్ టెం డర్‌లో భాగంగా పనులను ఆపేశారు. నాటి నుంచి అయోమయమే.నిడదవోలులో కూడా ఐదేళ్ల నుంచీ అతీ గతీ లేని పనులను ఇప్పుడు తెరపైకి తెచ్చి హడావుడీ చేస్తున్నారు.అనపర్తిలో అవినీతి, మాటల్లోనే జరిగిన అభి వృద్ధిపై చర్చకు మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సవాల్ చేయగా పోలీసుల సహాయంతో ఆయనను నిలువరించి.. సిట్టింగ్ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి ఇంటి పట్టునే గుట్టుగా ఉన్న విషయం తెలిసిందే.గోపాలపురం నియోజక వర్గంలో రోడ్లు,డ్రైన్లు దుస్థితిలో ఐదేళ్ల నుంచీ కొట్టుమి ట్టాడుతున్నాయి.

నాణ్యత 'గాలి'కేనా..

అర్భాటపు పనుల్లో నాణ్యత 'గాలి'కొదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి రోజూ చెకింగ్ రిపోర్టులు ఆయా పని ప్రాంతాల్లో రోజూ అందుబాటులో ఉండాలి. సిమెంటు, ఇసుక, కంకర నాణ్యత గురించి ఎవరైనా వెళ్లి ప్రశ్నిస్తే వాటిని చూపించాలి. కానీ.. ఇప్పుడు పని అంతా అయిపోయాక ఎంబుక్ రికార్డు చేశాక దానిలోని తేదీల ప్రకారం క్వాలిటీ కంట్రోల్ రిపోర్టులను 'ఎందుకో' ఇచ్చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డ్రైన్ల నిర్మాణం మరీ దారుణంగా జరుగుతోందని అంటున్నారు. క్వాలిటీ కంట్రోల్ కంపెనీకి వైసీపీ పెద్దలతో 'సత్సంబంధాలు' ఉండడంతో ఫొటోలతో 'సరిపెట్టేస్తూ' నాణ్యతకు తిలోదకాలు ఇచ్చేశారనే విమర్శలు పెద్ద సంఖ్యలో వినవస్తున్నాయి. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న పనులు నాణ్యత విషయంలో మరీ దారుణంగా ఉన్నాయని అంటున్నారు.



కొవ్వూరులో పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న హోం మంత్రి వనిత

నాలుగేళ్ల కిందట నిధులొచ్చినా.. ఇప్పుడే శంకుస్థాపన

కొవ్వూరు, మార్చి 13 : ఎట్టకేలకు కొవ్వూరు పట్టణ పోలీస్ స్టేషన్ నూతన భవనానికి హోం మంత్రి తానేటి వనిత శంకుస్థాపన చేశారు. పోలీస్ స్టేషన్ నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే రూ.1.40 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు.అయితే ఆ తరువాత నిధులు మురిగిపోయాయన్నారు. మళ్లీ పోరాడి నిధులు తెచ్చానని పేర్కొన్నారు. అధునాతనంగా మోడల్ పోలీస్టేషన్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. అయితే ఆమె కొవ్వూరులో మంత్రి హోదాలో ఉన్నప్పుడు ఈ పోలీస్ స్టేషన్ గురించి ఆలోచించలేదు. ఎన్నికల వేళ గోపాలపురం నుంచి వచ్చి హడావుడి ప్రారంభించడం కొసమెరుపు.కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఏలూరు రేంజ్ డీఐజీ జి.వి.జి.అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ పి.జగదీశ్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ డి.ప్రభాకర్, కొవ్వూరు డీఎస్పీ రామారావు, టౌన్ సీఐ వి.జగదీశ్వరరావు పాల్గొన్నారు.



ఇదే శిలాఫలకమండోయ్ : రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టే పనులకు ఫ్లెక్సీ ఆవిష్కరించి..కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఇన్‌చార్జి, మంత్రి వేణుగోపాలకృష్ణ

ఎంపీగారూ.. ఇదేం తీరు!

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 13 : రాజమహేంద్రవరంలో పనులు జాతర జరుగుతుంది. హడావిడిగా ఎన్నికల కోడ్ వచ్చేలోగా పనులు ప్రారంభించేస్తే ముందుగానే మంజూరైన పనులు కాబట్టి ఎన్నికల కోడ్ ఆంక్షలు ఉండవనే ఆలోచనతో వైసీపీ ప్రజాప్రతినిధి నగరంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పార్కుల్లో పనులు వేగవంతంగా చేయిస్తున్నారు.ఈ పనులు నాణ్యతలేమితో జరుగుతున్నా యి. ఇప్పటి వరకు పనుల విషయంలో నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వం 40 రోజుల్లో ఎన్నికలను పెట్టుకుని ఇప్పు డు సిసిరోడ్లు, డ్రైనేజీలు, పార్కుల్లో సుందరీకరణ పనులు, చేసేస్తు న్నారు.రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు తక్కువ నగరపాలక సంస్థ సాధారణ నిధులు ఎక్కువశాతంతో పనులు జరుగుతున్నాయి. రాత్రికి రాత్రికి పను లు చేస్తున్నారు. గాంధీ పార్కులో సుందరీకరణ పనులు, దానవాయిపేట, గాంధీపురం, లలితానగర్, శ్రీరామ్ నగర్, ఎల్‌బి శాస్త్రి రోడ్డు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు వేగంగా జరుతున్నాయి. వెనుకబడిన ప్రాంతాల్లో మాత్రం ఎటువంటి అభివృద్ధి కనిపించడంలేదు. నగరంలో ముంపుప్రాంతాల్లో సమస్యలపై శాశ్వత పరిష్కారం లేకుండా పనులు జరుగుతున్నాయి. రానున్న ఎన్నికల్లో ప్రజలను ఆకర్షించేందుకు పనులు వేగంగా చేస్తున్నారు. ఐదేళ్లుగా వదిలేసి ఇప్పుడు మాత్రం పరుగులు పెడుతున్నారు. హడావుడి పనులపై ప్రజలు లోలోపల మండిపడుతున్నారు. బయటపడితే వలంటీర్ల ద్వారా వైసీపీ నాయకులకు తెలిసి వారి నుంచి ఎలాంటి పరిస్థితులు ఎదు రవుతాయోనని నోరు మెదపడంలేదు. కాని ఎన్నికల్లో వారి పవర్ ఏమిటో చూపిస్తారని చెప్పడం కనిపిస్తోంది.



మేడిపండు తరహా రోడ్డు : ప్లాస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు



నాణ్యత ఎంత? : దానవాయిపేట గాంధీ పార్కులో వేగంగా సా..గుతున్న పనులు

ఎన్నికల జీవోలేనా.... ఎవరిని మభ్యపెట్టడానికి!

రాజమహేంద్రవరం రూరల్ మార్చి13 : పాతవాటికే బిల్లులు రాలేదు.. కొత్త పనులు ఎలా చేపట్టాలంటూ గుత్తేదారులు గగ్గోలు పెడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత నాలుగేళ్లుగా కానరాని అభివృద్ధి పనులకు హడావుడి జీవోలు తెచ్చి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంత్రి వేణుగోపాలకృష్ణ గ్రామాల్లో అట్టహాసంగా శంకుస్థాపనలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ. 10 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధి 10 గ్రామాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు తదితర నిర్మాణాలకు జీవో తెచ్చారు. పనులకు సంబంధించి టెక్నికల్ శాంక్షన్లు తయారు చేశారు. గత వారం రోజులుగా గ్రామాల్లో అధికారులు, నాయకులను వెంటబెట్టుకుని కనీసం శిలాఫలకాలు కూడా లేకుండా ఫ్లెక్సీలను పెట్టి శంఖుస్థాపనలు చేస్తున్నారు. నేటికి ఏ పని చేయడానికి గుత్తేదారులు ముందుకు రావడంలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గతేడాది నవంబరు నెలలో ఉపాధి హామీ పథకం కింద రూరల్ మండలానికి రూ.60 లక్షల నిధులు మంజూరు చేశారు. సుమారు ఆరు నెలలు కావొస్తున్నా నేటికి వీటికి సంబంధించి పనులు మొదలు కాలేదు. మండల పరిషత్, పంచాయతీ నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

కాంట్రాక్టర్లకు రూ. కోటికి పైగా బకాయిలు

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణాలు చేపట్టిన భవనాలకు సంబంధించి ఒక్క రూరల్ మండలం పరిధిలోనే సుమారు 1.50 కోట్లు బకాయిలు గుత్తేదారులకు ఉంది. చేసిన పనుల బిల్లులన్నీ సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ అయినా నేటికి బిల్లులు అందలేదు. దీంతో గుత్తేదారులు తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉంది. ఈ పనులు చాలా మంది అధికార పార్టీ వారు చేపట్టడంతో నోరు మెదపలేకపోతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకూ ఫారం 7,8 స్వీకరణ

- త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్
- జనవరి 23 నుంచి 11,331 ఓట్లు తొలగింపు
- జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 13: త్వరలో సార్వత్రిక ఎన్నికలు నోటిఫికేషన్ విడుదలవుతుందని జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత తెలిపారు. ఈ మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లు దాఖలు, అఫిడవిట్లు సమర్పించే విషయంలో ఎన్నికల కమిషన్ నియమావళి సమయపాలన ఖచ్చితంగా పాటించాలన్నారు. ఎన్నికలు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీ తనంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజల ద్వారా వచ్చే ఫిర్యాదులు వివిధ మాధ్యమాల్లో వచ్చే ప్రతికూల వార్తలు విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు తీసుకున్న చర్యల గురించి ఎప్పటికప్పుడు వివరణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే తేదీ వరకు ఫారం 7,8 స్వీకరిస్తామన్నారు. 18 ఏళ్ళ నుంచి 21 ఏళ్ళ మధ్య వయస్సు ఉన్న వారి నుంచి ఫారం 6 దరఖాస్తులు తీసుకుంటామన్నారు. తుది ఓటరు జాబితా నుంచి మరణించిన వారి ఓట్ల తొలగింపు విధానంలో ప్రధాన ఎన్నికల అధికారి ఆమోదం పొందడం జరుగుతుందన్నారు. జనవరి 23 నుంచి ఈ రోజు వరకు 11,331 ఓట్లను తొలగించామని చెప్పారు. చిరునామా మార్పుకు సంబంధించి 4,392 ఓట్లు , మరణించిన ఓట్లు 4225 , డూప్లికేట్ ఓట్లు 2701 ఓట్లు ఉన్నాయన్నారు. ఓటు హక్కుకలిగి ఉండి ఎపిక్ కార్డ్ లేకపోయినా ఏదో ఒక గుర్తింపుకార్డుతో ఓటు వేయవచ్చన్నారు. సమావేశంలో డీఆర్‌వో జి.నరసింహులు, కేఆర్ఆర్‌సీఎస్‌డీడీ ఆర్.కృష్ణనాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కాంగ్రెస్ నాయకులు నలబాటి రమేష్, బీజేపీ పివి లక్ష్మి, సీపీఎం ఎస్ఎస్.మూర్తి, టీడీపీ సిహెచ్ శ్రీనివాసరావు, వైసీపీ వైఎస్ శ్యామల , ఎలక్షన్ డీటీ ఎమ్.సునీల్ కుమార్ ,గిరీష్ ,తులసి పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

56 గ్రాముల బంగారం స్వాధీనం

రాజమహేంద్రవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో దొంగతనాలు చేస్తున్న ఓ వ్యక్తిని ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ) అరెస్టు చేశారు. డీఎస్పీ ఎల్.మోహన్‌రావు ఆదేశాలతో రైళ్లలో చోరీలు చేస్తున్న దొంగలపై రాజమహేంద్రవరం రైల్వే పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. దీనిలో భాగంగా తాడేపల్లిగూడెం మండలం మాధవరం గ్రామానికి చెందిన కడియాల శ్రీధర్‌ని జీఆర్పీ ఎస్ఐ పి.లోవరాజు అదుపులోకి తీసుకున్నారు. అతడిపై మూడు కేసుల్లో నమోదైన రూ.2.50లక్షల విలువ చేసే 56 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విజయవాడలోని రైల్వే కోర్టులో హాజరుపరిచామని డీఎస్పీ పేర్కొన్నారు. దర్యాప్తులో ప్రతిభ చూపిన ఎస్ఐ లోవరాజు, కానిస్టేబుళ్లు వీరబాబు, రవి, రమణారావు, ఆర్పీఎఫ్ సిబ్బందిని ఆయన అభినందించారు.





వైరు తగిలిందా! ప్రాణాలు గోవిందా!

రాజమహేంద్రవరం కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం ఈ చిత్రాలు.. ఇది నిత్యం రద్దీగా ఉండే రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డు.. ఇది అసలే ఇరుకు రోడ్డు.. ప్రతి రోజూ వేలాది మంత్రి ఈ రోడ్డుపై అటూ ఇటూ తిరుగుతూనే ఉంటారు.. అటువంటి రోడ్డుపై ఎంపీ భరత్ పుణ్యమా అని సుమారు ఏడాది కిందట సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అయితే ఏమైందో ఏమో కానీ ఆ లైట్లు పీకేశారు. అయితే కార్పొరేషన్ సిబ్బంది కరెంట్ వైర్లు మాత్రం ఇలా బహిరంగంగా వదిలేశారు.. ఏదైనా కరెంట్ వైరుకు ఉన్న టేపు ఊడిందా అంతే ప్రాణాలు గోవిందా.. ఇకనైనా కళ్లు తెరవండి...జాగ్రత్త చేపట్టండి. - రాజమహేంద్రవరం సిటీ

తూర్పుగోదావరి


రఘుదేవపురం ప్రభుత్వ పాఠశాల నుంచి ఎంపికైన నాగేంద్రకుమార్‌తో, ఉపాధ్యాయులు, విద్యార్థులు

జాతీయ స్థాయి 'ఇన్‌స్పైర్'కి..

జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు

రాజమహేంద్రవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి రెండు వైజ్ఞానిక ప్రదర్శనలు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయని జిల్లా సైన్సు అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ తెలిపారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకూ చిత్తూరు జిల్లా గంగవరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ జరిగిందన్నారు. కొవ్వూరు మండలం ఐ.పంగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బైశెట్టి లక్ష్మణ్, గైడ్ టీచర్ మల్లిపూడి రాజు తయారుచేసిన రైతుబంధు అనే వ్యవసాయ యంత్రం, సీతానగరం మండలంలోని రఘుదేవపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.నాగేంద్రకుమార్, గైడ్ టీచర్ జి.శేఖర్ రూపొందించిన చేతితో సులభంగా కొబ్బరికాయ ఒలిచే యంత్రం జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం జరిగిందన్నారు. విద్యార్థులకు, గైడ్ టీచర్లకు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, సమగ్ర శిక్షా ఏపీసీ ఎస్.సుభాషిణి, డిప్యూటీ ఈవో ఈవీబీఎన్ నారాయణ, జిల్లా సైన్సు అధికారి నెహ్రూ అభినందించారు. రెండు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.


అవార్డు అందుకుంటున్న విద్యార్థి బైశెట్టి లక్ష్మణ్, గైడ్ మల్లిపూడి రాజు

జాతీయస్థాయికి పంగిడి విద్యార్థి ఎంపిక

కొవ్వూరు, మార్చి 13: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో కొవ్వూరు మండలం పంగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బైశెట్టి లక్ష్మణ్, గైడ్ టీచర్ మల్లిపూడి రాజు పర్యవేక్షణలో రూపొందించిన రైతుబంధు వ్యవసాయ పరికరం జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. తమ పాఠశాల విద్యార్థి తయారుచేసిన ప్రాజెక్టు జాతీయస్థాయికి ఎంపికవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన

దేవరపల్లి, మార్చి 13: దేవరపల్లిలో శ్రీకృష్ణచైతన్య యాదవ సంఘం కమ్యూనిటీ హాలు నిర్మాణంకోసం 3సెంట్ల స్థలాన్ని కేటా యించి మండల పరిషత్ నిధుల నుంచి రూ.6లక్షలు ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ కేవీకే దుర్గారావు తెలిపారు. బుధవారం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేవీకే దుర్గారావు మాట్లాడుతూ దేవరపల్లి మండలంలో పలు కులాలకు కమ్యూనిటీ హాలుకు నిధులు మంజూరు చేయడం జరిగిందని దేవరపల్లిలో యాదవ సంఘం కమ్యూనిటీ హాలుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, వైసీపీ మండల ఉపాధ్యక్షుడు కామిశెట్టి దుర్గారావు, యాదవ సంఘం నాయకులు సత్యనారాయణ, జమ్మి అన్నవరం, గోపనబోయిన శ్రీను, గుడ్ల శ్రీను, కే.రాజు, జీ.వెంకటేశ్వ రరావు, తానింకి సూర్యనారాయణ, కే.రామకృష్ణ, పాశం ప్రసాద్, సత్యనారాయణ, పాల్గొన్నారు.

వియత్నాం సెమినార్‌కు ఎంపికైన తపస్విరెడ్డి



నిడదవోలు, మార్చి 13: నిడదవోలు పట్టణంలో 6వ తరగతి చదువుతున్న కుంచాల తపస్విరెడ్డి వియాత్నాంలోని అనోయిలో జరిగే ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ సెషన్స్‌లో పాల్గొనేందుకు ఎంపికైనట్లు విద్యార్థి తండ్రి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మార్చి 15 నుంచి 17వ తేదీ వరకు జరిగే యునైటెడ్ నేషన్స్ హై కమీషనర్ ఫర్ రెఫ్యూజెస్ సహకారంతో జరిగే యునైటెడ్ నేషన్స్ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో పాల్గొనేందుకు వెళుతున్న సందర్భంగా పలువురు పట్టణ ప్రముఖులు నిడదవోలు విద్యార్థి కుంచాల తపస్విరెడ్డిని అభినందించారు.

తానా కార్యదర్శిగా విద్యాధర్ ఎంపిక


విద్యాధర్ గారపాటి

చాగల్లు, మార్చి 13 : చాగల్లుకి చెందిన ఎన్ఆర్ఐ విద్యాధర్ గారపాటి 2023 - 25 సంవత్సరాల కాలానికి తానా ఫౌండేషన్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆయన గత 20 సంవత్సరాలకు పైగా న్యూ జెర్సీలో ఉంటూ మూవర్స్ డాట్ కామ్, ఎన్‌జిఐ గ్రూపుల అధినేతగా వ్యాపారాల్లో రాణిస్తున్నారు. తానా ట్రస్టీగా అందించిన సేవలకు గుర్తింపుగానే కార్యదర్శిగా ఎన్నికైనట్లు చెప్పారు. కోవిడ్ సమయంలో తెలుగు రాష్ట్రాల్లో అనేక సేవలందించారు. స్వగ్రామమైన చాగల్లులో కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులు అనేకం నిర్వహించడానికి సహకరించారు. హైస్కూల్‌ను మౌళిక వసతులు కల్పించడానికి ఆర్థిక సహకారం అందించారు. ఆయనకు తానా కార్యదర్శిగా ఎంపికవడంపట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి వనిత పూజలు

కొవ్వూరు, మార్చి 13 : కొవ్వూరు శ్రీనివాసపురంలో వెంకటేశ్వరస్వామి, ప్రకృతి రావణాబ్రహ్మ ఆలయాల్లో హోంమంత్రి తానేటి వనిత బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి వనితకు అర్చకులు పూర్ణ కుంభంతో స్వాతం పలికారు. మంత్రి వనిత, ఎమ్మెల్యే తలారి వెంకట్రావులు వెంకటేశ్వరస్వామికి పూజలు చేశారు. అనంతరం శ్రీనివాస స్నానఘట్టంలో ఉన్న ప్రకృతి రావణాబ్రహ్మ మల్లిఖార్జునస్వామికి అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పన

ఉండ్రాజవరం, మార్చి 13 : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేసిందని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కె.సావరంలో గ్రామ సచివాలయ భవనాన్ని, రైతుభరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటా యల్లారీశ్వరి, జిల్లా అగ్రిబోర్డు అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. ఉండ్రాజవరంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు జగనన్న ఇళ్లస్థల పట్టాలు అందజేశారు.

పీఎంపీల సమావేశం

ఉండ్రాజవరం, మార్చి 13 : ఉండ్రాజవరం మండల పీఎంపీల సంఘ సర్వసభ్య సమావేశం బుధవారం మండలంలోని వేలివెన్ను గ్రామంలో జరిగింది. ఈ సమావేశంలో తణుకు పట్టణానికి చెందిన డాక్టర్ సుంకు జీవన రవితేజ పీఎంపీలకు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం మండల నూతన కమిటీ నియామకం జరిగింది. కార్యక్రమంలో పీఎంపీల సంఘ రాష్ట్ర నాయకులు కోటేశ్వరరావు, రమేష్, జిల్లా నాయకులు రామకృష్ణ, కిరణ్, ఆర్ఎస్ఎస్ మల్లేశ్వరరావు, ఏపీ నరసింహారావు, వీరేశలింగం పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు స్పోర్ట్ కిట్స్

నిడదవోలు, మార్చి 13: నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బుధవారం కెనరా బ్యాంక్ నిడదవోలు బ్రాంచి ఆర్థిక సహకారంతో స్పోర్ట్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఉపేంద్ర, ఎం.చంద్రమౌళి, డీఎస్ రాయ్, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అన్న సమారాధన


భోజనం వడ్డిస్తున్న మహిళలు

దేవరపల్లి, మార్చి 13: శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా దేవరపల్లిలో పార్వతిసమేత ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేలాదిమంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయకమి టీ సభ్యులు అంబటి శ్రీనివాసరావు, కేశిరాజు రాజ్‌కుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసీపీని మట్టికరిపించడం ఖాయం

• నిడదవోలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్


సమావేశంలో మాట్లాడుతున్న కందుల దుర్గేష్

పెరవలి, మార్చి 13: రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీపార్టీలు సంయుక్తంగా వైసీపీని మట్టి కరిపించడం ఖాయమని నిడదవోలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కానూరు వైనాట్ కల్యాణ మండపంలో నిడదవోలు నియోజకవర్గ స్థాయి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన దుర్గేష్ మాట్లాడుతూ అనుకోని పరిస్థితుల్లో రాజమండ్రిరూరల్ నియోజకవర్గం నుంచి ఇక్కడకు రావడం జరిగిందని చంద్రబాబు, పవన్‌లు రాష్ట్ర స్థాయి లో తీసుకున్న నిర్ణయం మేరకు కొన్నిచోట్ల సర్దుకోవడం జరిగిందని దానిలో భాగంగా నిడదవోలు వచ్చానన్నారు. టీడీపీ నాయకులు బూరుగుపల్లి శేషారావు, కుందుల సత్యనారాయణ, రాబోయే ఎన్నికల్లో తనకు పూర్తి సహకారం అంది స్తారన్న ప్రగాడ విశ్వాసం ఉందన్నారు. నిడదవోలు నియోజక వర్గం అభివృద్ధి పరంగా అన్ని విధాలుగా అభివృద్ధి లేదని తాను వచ్చిన తరువాత అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా నన్నారు. టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం రావాలని అందరూ కోరుతున్నారన్నారు. గతంలో తాను ఎమ్మెల్సీగా పని చేశానని ఎక్కడా అవినీతికి పాల్పడకుండా పని చేశానన్నారు. జనసేన కార్యకర్తలు సైనికుడిలా పని చేయాలన్నారు. గ్రామ స్థాయిలో ప్రతీ ఇంటికీ వెళ్లి మ్యానిఫెస్టో వివరాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. నిడదవోలు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి భోగవల్లి ప్రసాద్ మాట్లాడుతూ పవన్ తనను నిడదవోలు ఇన్‌చార్జిగా నియమించారని గత నాలుగైదు నెలలుగా నియోజకవర్గంలో జనసేన పటిష్టకు కృషి చేశాన న్నారు. మిత్రపక్షాల సహకారంతో కందుల దుర్గేష్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పిప్పర రవి, పి. బాలాజీ, రంగా రమేష్, వెంకటరత్నం, తులా చినబాబు , కోటిపల్లి మురలీకృష్ణ రంకిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.


వైసీపీ నుంచి వచ్చిన వారిని టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యులు

టీడీపీలో పలువురి చేరిక

కొవ్వూరు, మార్చి 13 : వైసీపీ రాక్షసపాలనకు చరమగీతం పాడదామని ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరిలు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం వైసీపీ నుంచి మాజీ కౌన్సిలర్లు బర్ల శ్రీనివాస్, ఆబోతు వినోద, నాయకులు కుదుళ్ల గోపి, బొబ్బిలి పేర్రాజు, బత్తి అబ్బులుకు ద్విసభ్య కమిటీ సభ్యులు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరిలు మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గపు, రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలుచేస్తున్న సైకో ముఖ్యమంత్రిపై పోరాటం చేస్తున్నామన్నారు. వైసిపి 5 సంవత్సరాల పాలనలో బీసీలకే చేసిందేమీ లేదన్నారు. ఎన్ని కలహాలు, సమస్యలు ఉన్నా.. మనమంతా ఒకే కుటుంబ సభ్యులమని అందరినీ కలుపుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే భావితరాలకు భవిష్యత్ ఉంటుందన్నారు. చంద్రబాబు ప్రకటించిన బాబు సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేసి రానున్న సార్వత్రిక ఎన్నికలలో జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. పార్టీలోకి వస్తున్న కొత్తవారిని కలుపుకుని జగన్‌రెడ్డిని ఇంటికి పంపించాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దపట్ల శివరామకృష్ణ, గొర్రెల శ్రీధర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, కాగిత రఘు, రంభ హరిబాబు, పెనుమాక జయరాజు, జి.జి. చలం, వేమగిరి వెంకట్రావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

19 నుంచి కోరుకొండ నరసన్న కల్యాణోత్సవాలు

• పోస్టర్ ఆవిష్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

కోరుకొండ, మార్చి13: శతాబ్దాల చరిత్ర కలిగిన కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారు దివ్య కల్యాణ మహోత్సవాలు ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె. రామచంద్రమోహన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి ఆలయ ముఖ మండపంనందు దేవస్థానం ఛైర్మన్ పరాసర రంగరాజభట్టర్ స్వామి, దేవస్థానం పర్యవేక్షణాధికారి కాపవరపు సూర్యనారాయణ, ఎస్‌వీపీవీ స్ఎన్ మూర్తి, చంగన వీర్రాజు, పీఎస్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. దీని ప్రకారం ఈ నెల 19వ తేదీ మంగళవారం సాయంత్రం 5గంటలకు వైకాసన ఆగమ పండితులు పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు, అనువంశక అర్చక స్వాములు స్వామివారి కోనేరు వద్ద నుంచి పుట్ట మన్ను తెచ్చి అంకురార్పణ, ధ్వజారోహన చేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 20న బుధవారం మధ్యాహ్నం 2గంటలకు స్వామి వారి రథోత్సవం. రాత్రి 9గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 21న గురువారం కొండపైన, కొండ దిగువన స్వామివారి దర్శనాలు, రాత్రి 9గంటలకు స్వామి వారికి గరుడ వాహన సేవ. 22న శుక్రవారం ఉదయం నిత్యోపాసనతో స్వామివారి దర్శనాలు ప్రారంభం. రాత్రి 7గంటలకు స్వామి వారి ఆలయ ముఖ మండపంలో వేదపండితుల సమక్షంలో స్వామివారికి సదస్యం జరుగుతుంది. రాత్రి 9గంటలకు హనుమద్ వాహనంపై స్వామి గ్రామోత్సవం. 23న శనివారం స్వామివారి నిత్యోపాన అనంతరం దర్శన ఏర్పాట్లు, రాత్రి 9గంటలకు స్వామి వారికి గజవాహనం స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి 7గంటలకు శ్రీ రంగరాజ స్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 24న ఆదివారం స్వామి వారికి ఉదయం 9గంటలకు, శ్రీ అనంతపద్మనాభ స్వామివారి సమక్షంలో దేవుని కోనేటి వద్ద శ్రీ చక్ర పెరుమాళ్ళకు పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, అనంతరం చక్రతీర్థం జరుగుతుంది. సాయంత్రం ధ్వజాఅవరోహణ, అద్దాల సేవ, ఊంజల సేవ జరుగును, రాత్రి 9గంటలకు స్వామివారి శేషవాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది. 25వ తేదీ సోమవారం సాయంత్రం స్వామివారికి ద్వాదశప్రదక్షణలు, ద్వాదశ నివేదనలు, పర్యాంక శయనోత్సవం, శ్రీ పుష్పయాగం జరుగుతుందని రంగరాజభట్టర్ స్వామి తెలిపారు.


స్వామివారి కల్యాణోత్సవ పోస్టర్ విడుదల చేస్తున్న చైర్మన్ రంగరాజభట్టర్, అన్నవరం దేవస్థానం అధికారులు

శ్రీ లక్ష్మీ నారాయణస్వామికి విశేష పూజలు



నిడదవోలు, మార్చి 13: నిడదవోలు మండలం మునిపల్లి గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీ నారాయణస్వామికి బుధవారం విశేష పూజలు నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 7 వారాలు 11 ప్రదిక్షణలు కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఏప్రిల్ 5, 6, 7 తేదీల్లో

రాష్ట్రస్థాయి యూత్ ఫెస్టివల్

• రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహణ


యూత్ ఫెస్టివల్ ఉద్భవ్ బ్యానర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 13 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఉద్భవ్ పేరుతో ఏప్రిల్ 5, 6, 7 తేదీల్లో రాష్ట్రస్థాయి యూత్ ఫెస్టివల్ జరగనుంది. కళాశాల ఆవరణలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో యూత్ ఫెస్టివల్‌కు ఉద్భవ్ అనే పేరును నిర్ణయించారు. కళాశాల విద్యార్థిని శివశంకరి ఆధ్వర్యంలో విద్యార్థులు తమ చేతి గుర్తులతో వేసిన బ్యానర్‌ను కళాశాల భవనంపై ఆవిష్కరించారు. విద్యార్థి వ్యాపారాభివృద్ధి (స్టూడెంట్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్) అనే నినాదంతో యూత్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ అధ్యాపకుల ప్రమేయం లేకుండా, రాష్ట్రస్థాయిలో విద్యార్థులు నిర్వహించే మొదటి స్టూడెంట్ ఫెస్ట్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ డి.సంజీవ్‌కుమార్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అన్నపూర్ణ, ఫెస్ట్ కో ఆర్డినేటర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

నల్లజర్ల, మార్చి 13: నల్లజర్ల మండలంలోని పలు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులను హోంమంత్రి తానేటి వనిత ప్రారంభించారు. బుధవారం పోతవరంలో బీసీ కమ్యూనిటీ హాల్, ముసుళ్ళకుంటలో వాటర్ ట్యాంకు, మారెళ్ళమూడిలో సచివాలయం ప్రారంభోత్సవం చేశారు. జగన్నాధపురం గ్రామంలో డ్వాక్రా మహిళలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంకా జయలక్ష్మి, బంకా అప్పారావు, కారుమంచి రమేష్,వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, గగ్గర శ్రీను పాల్గొన్నారు.

ఇంటి స్థలం హక్కు పత్రాల పంపిణీ

తాళ్ళపూడి, మార్చి 13 తాళ్ళపూడి మండలం వేగేశ్వరపురం దానయ్య ఎస్టేట్ ప్రాంగణంలో జగనన్న ఇంటి స్థలం హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా కొవ్వూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు విచ్చేశారు. ఎమ్మెల్యే తలారి ఆధ్వర్యంలో మండలంలో 11 గ్రామాలలో 1501మందికి ఇంటి హక్కు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడిగా చెల్లుబోయిన

కడియం, మార్చి 13: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు పార్లమెంట్ పరిధి రంపచోడవరం తెలుగుదేశంపార్టీ పరిశీలకుడిగా కడియం మండలం వేమగిరి గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి, జోన్-2 కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాసరావు(లంక శ్రీను) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

18 నుంచి పదో తరగతి పరీక్షలు : ఎంఈవో

దేవరపల్లి, మార్చి 13: ఈ నెల 18 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతాయని మండల విద్యాశాఖ అధికారి ఎం.తిరుమలదాసు ఆర్ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. బుధవారం ఎంఈవో కార్యాలయంలో తిరుమలదాసు, అప్పారావులు మా ట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి దేవరపల్లి మండలంలో 5సెంటర్స్‌లో పరీక్షలు జరుగుతాయని, మండలంలోని దేవరపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్, చిన్నాయిగూడెం, యర్నగూడెం, జిల్లా పరిషత్ హైస్కూల్లోను, దేవరపల్లి భాష్యంస్కూల్, చైతన్య స్కూల్ లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మండల పరిధిలో 1199 మంది విద్యార్థులు హాజరవుతారని వీరిలో బాలురు 587మంది, బాలికలు 612మంది ఉన్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్లు 74మందిని, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను 10మందిని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పరీక్షల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. పరీక్షా కేంద్రాలకు ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని తెలిపారు. ఉపాధ్యా యులు విద్యార్థులు సెల్‌ఫోన్స్ తీసుకురాకూడదన్నారు. ఉదయం 8.30కల్లా నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా మెటీరియల్ పంపిణీ

కొవ్వూరు, మార్చి 13 : భారత్‌వికాస్ పరిషత్ శివమ్ ఎంటర్‌ప్రైజస్ సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా మెటీరియల్‌ను అందజేశారు. బుధవారం కొవ్వూరు సంస్కృత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడు డా. వై.రమేష్ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా.కె.ఎస్.ఎన్. మూర్తి మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు ఆహార అలవాట్లను మార్చుకోవాలని, సెల్‌ఫోన్, టి.వి.లకు దూరంగా ఉండాలన్నారు. ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉన్నట్లయితే పరీక్షలను సులభంగా రాయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జీబీవీ సుబ్రహ్మణ్యం, ఎస్. రాఘవేంద్రరావు, నాళం అప్పారావు, సత్యనారాయణ, శ్రీనివాస్, పాఠశాల హెచ్.ఎం. గోవర్ధనం శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

కొవ్వూరు, మార్చి 13: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రజలు, నాయకులు సహకరించాలని కొవ్వూరు డీఎస్పీ కె.సిహెచ్.రామారావు అన్నా రు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు బుధవారం కొవ్వూరు మండలం కుమారదేవం, చిడిపి, కాపవరం, తోగుమ్మి, మద్దూరులంక, సీతంపేట గ్రామాలలో సుమారు 200 మంది కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. కవాతును డీఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు రూరల్ సీఐ పి.శ్రీనివాసరావు, ఎస్ఐ కె.సుధాకర్, సెంట్రల్ ఫో ర్సు కమాండెంట్సు, కొవ్వూరురూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


మద్దూరులో కేంద్ర బలగాల కవాతును ప్రారంభిస్తున్న డీఎస్పీ రామారావు

ఓసీ పేదలకు మంచి చేసే పార్టీకే మద్దతు

• కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు త్రినాథరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న త్రినాథరెడ్డి

అనపర్తి, మార్చి 13 : ఓసీ కులాలంటే ధనికులని ముద్రపడిపోవడంతో ఓసీ కులాల్లో కడు పేదరికంలో ఉన్న కులాలను ఏ రాజకీయపార్టీలు, ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డి అన్నారు. బుధవారం అనపర్తిలోని టీజీఆర్‌ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓసి కులాలలో అనేకమంది పేదలు ఉన్నారని వారిని ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికలలో ఓసీలలో ఉన్న పేదలకు సంక్షేమం అందించే పార్టీకే తమ మద్దతు ప్రకటిస్తామన్నారు. అగ్రవర్ణాలలో ఉన్న పేదలకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందిస్తారో వారి మేనిఫెస్టోలో పెట్టాలని అలా పెట్టిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని అన్నారు. ఓసీ కులాల్లో పేదలు అటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఏ ప్రభుత్వాలు పట్టించుకోక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సంఘం ప్రదాన కార్యదర్శి సత్తి వీరెడ్డి మాట్లాడుతూ మిగిలిన కులాలలో పేదలకు ఎటువంటి సంక్షేమం అందిస్తున్నారో అదేవిధంగా అగ్రకులాల పేదలకు అందించాలని కోరుతున్నా మని అన్నారు. త్వరలోనే ఓసీలోని అన్ని కులాలతో సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందించి మద్దతుపై ప్రకటన చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం యువజన విభాగపు అధ్యక్షుడు తాడి చంద్రశేఖరరెడ్డి, నల్లమిల్లి వినురెడ్డి, ఆదిరెడ్డి, నాగురెడ్డి, పడాల సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుబ్బాలమ్మ హుండీ ఆదాయం రూ.1,82,397

నిడదవోలు, మార్చి 13: నిడదవోలు మండలం గోపవరం గ్రామంలో ఉన్న గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. సుమారు నాలుగు నెలల ఆరు రోజులకుగాను అమ్మవారికి హుండీ ద్వారా రూ.1,82,392లు ఆదాయం లభించినట్లు ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు తెలిపారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్ర మంలో దేవదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎ.సుజన్‌కుమార్, గ్రామస్తులు ఆరేపల్లి చంటి, దొడ్ల మురళీకృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

130 క్వింటాళ్ల

పీడీఎస్ బియ్యం స్వాధీనం


అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్న రెవెన్యూ, పోలీస్ సిబ్బంది

గోపాలపురం, మార్చి 13: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని వాహనాన్ని తనిఖీల్లో భాగంగా రెవెన్యూ, పోలీస్ సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు. సీఎస్‌డీటీ తాతాపూడి దివాకర్, పోలీస్ సిబ్బంది సహకారంతో రూ.2లక్షల 8వేలు విలువచేసే పీడీఎస్ బియ్యంను పట్టుకుని స్వాధీనం చేసుకుని వాహనం సీజ్ చేసినట్లు ఎస్ఐ కే.సతీష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం 11గంటల సమయంలో విధులు నిర్వహిస్తుండగా గోపాలపురం శివారులో ఉన్న పెట్రోల్‌బంకు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఐసర్‌వ్యాన్‌పై పీడీఎస్ బియ్యం తనిఖీల్లో బయటపడ్డాయన్నారు. 130క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.2లక్షల 8వేలు ఉంటుందన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన అల్లుమల్లు రాముని అదుపులోకి తీసుకుని సీఎస్‌డీటీ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వర్చువల్‌గా ప్రధానమంత్రి సూరజ్ పథకం ప్రారంభం


సూరజ్ పథకాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న ప్రధాని మోదీ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 13 : ప్రధానమంత్రి సూరజ్ పథకాన్ని బుధవారం సాయంత్రం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన దూరదర్శన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డీవీ ప్రసాద్, సాంఘిక సంక్షేమాధికారి సందీప్ మాట్లాడుతూ సూరజ్ పథకంలో పారిశుధ్య కార్మికులకు జిల్లాలోని కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలో 4 కిట్లు, నిడదవోలు పురపాలక సంఘం పరిధిలో 29 కిట్లు అందజేసినట్టు తెలిపారు. ఎస్ఎస్ఎఫ్‌డీసీ ఆర్థిక సంస్థ ద్వారా ఎస్సీ లబ్ధిదారులకు, ఎస్ఎస్‌కేఎఫ్‌డీసీ ఆర్థిక సంస్థ ద్వారా సహాయం పొందిన సఫాయి కర్మాచారి లబ్ధిదారులకు, ఎన్‌బీసీఎఫ్‌డీసీ ద్వారా ఆర్థిక సహాయం పొందిన బీసీ స్వయం ఉపాధి లబ్ధిదారులకు రూ.14,50,68,219ల ఆర్థిక ప్రయోజనం చేకూర్చడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు పి.సువర్ణ, భానుప్రకాష్, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ

కొవ్వూరు, మార్చి 13 : కొవ్వూరు పట్టణంలోని రోడ్డు కం రైలు బ్రిడ్జి వద్ద 15వ వార్డులో బుధవారం ఇళ్ల లబ్ధిదారులకు శ్రీరామ సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర రిజిస్ట్రేషన్ చేసి న ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిద్దన వాసు పాల్గొన్నారు.